# వర్కింగ్ జర్నలిస్ట్

సమాచార స్రవంతి

సంపుటి: 13 సంచిక: 7 జులై 2024 వెల: రూ. 5/-



## 'వికీలీక్స్' అసాంజె విడుదల

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సభ్యులతో ఫెడరేషన్ ప్రతినిధులు



రెవిన్యూ శాఖ
మంత్రి అనగాని
సత్యప్రసాద్‌తో

హోం శాఖ
మంత్రి
వంగలపూడి
అనితతో





వైద్య ఆరోగ్య శాఖ
మంత్రి
సత్యకుమార్
యాదవ్‌తో

కార్మిక శాఖ మంత్రి
వాసంశెట్టి సుభాష్‌తో



# స్వేచ్ఛగా పనిచేసే వీలు కల్పించండి!

ఆస్ట్రేలియాకు చెందిన జర్నలిస్టు, వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజె ఎట్టకేలకు జైలు నుంచి విడుదలయ్యాడు. అమెరికా ప్రపంచవ్యాప్తంగా చేసిన అకృత్యాలను బయటపెట్టిన నేరానికి దాదాపు పన్నెండేళ్లపాటు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వచ్చింది. బనాయించిన అక్రమ కేసులతో మానసికంగా కృంగిపోయిన పరిస్థితి. అమెరికా నిఘా వ్యవస్థలోని లొసుగులను బయటపెట్టి వారి అక్రమాలను ప్రపంచం ముందుంచారు. అసాంజెకు సమాచారం అందించిన సైనికాధికారి అమెరికా కోర్టు విధించే శిక్షను అనుభవించినా అసాంజెకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పలేదు. అంటే అసాంజె ఎలాంటి తప్పుడు చర్యలకు పాల్పడలేదని స్పష్టమయింది. అయిదేళ్లపాటు బ్రిటన్ జైల్లో శిక్ష అనుభవించాల్సి వచ్చింది. బ్రిటన్‌లోని ఈక్వడార్ రాయబార కార్యాలయంలో నిర్భంధంలో ఉండాల్సి వచ్చింది. లైంగిక వేధింపుల కేసును ఎదుర్కొన్నారు. నిజాలు చెప్పడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులు అన్నీఇన్నీ కావని అసాంజె సంఘటన మరోసారి రుజువు చేసింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు చిన్నవేమీ కావు. అనేకమంది జర్నలిస్టులు హత్యలకు గురవుతున్నారు. దాడుల బారినపడుతున్నారు, వేధింపులను ఎదుర్కొంటున్నారు, అయినా నిజాలను బయటపెట్టేందుకు జంకడం లేదు. జర్నలిస్టులు రక్షణలేని పరిస్థితిలో పనిచేస్తున్నారని అనేక సంఘటనలు రుజువు చేస్తున్నాయి. యుద్ధ వార్తలను సేకరించే విలేకరులకు రక్షణ తక్కువ. కానీ సాధారణ పరిస్థితుల్లో పనిచేసే జర్నలిస్టుల్లో హత్యలకు, అక్రమ కేసులకు గురవుతున్నవారి సంఖ్య చాలా ఎక్కువ. భారతదేశం ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామిక దేశమని చెబుతున్నప్పటికీ జర్నలిస్టుల రక్షణలో చాలా వెనకబడి ఉన్నాం. ప్రపంచ దేశాల్లో 161 స్థానంలో ఉన్నామంటే జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వాలు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాయో స్పష్టమవుతోంది. అక్రమాలు, అన్యాయాలను బయటపెట్టడం, నేరాలు జరుగుతున్న తీరుపై ఆరా తీసి వాటి ఆనవాళ్ళు లేకుండా చేసేందుకు వ్యవస్థకు సహాయం చేసే జర్నలిస్టులకే రక్షణ కరవైతే సామాన్య పౌరుల సంగతి చెప్పనక్కరలేదు. విపత్కర పరిస్థితుల్లో పనిచేసే జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, దాడుల నిరోధానికి తగిన ఏర్పాట్లు చేసేందుకు ఆయా దేశాల్లోని ప్రభుత్వాలు ప్రయత్నించాలని జర్నలిస్టుల రక్షణ కోసం ఏర్పాటైన ప్రపంచస్థాయి కమిటీ అన్ని దేశాలకు విజ్ఞప్తి చేస్తోంది. ఏదైనా సంఘటన జరిగిన సందర్భంలో ఆయా దేశాల ప్రభుత్వాల దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తున్నది. విశ్వగురువు స్థానంలో ఉండాలనుకుంటున్న భారతదేశంలో గడిచిన కొద్దికాలంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బనాయిస్తున్న అక్రమ కేసులు, చివరకు ఈడి దాడులకు కూడా తెగబడిన తీరు జర్నలిస్టుల పట్ల, మీడియా స్వేచ్ఛ పట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి అద్దం పడుతున్నది. ఇప్పటికైనా ఈ వైఖరిని విడనాడి స్వేచ్ఛాయుత వాతావరణంలో జర్నలిస్టులు పనిచేసే స్థితి కల్పించాలి.


## వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

సంపుటి: 13 జులై 2024 సంచిక: 7


### లోపలి పేజీల్లో...


వికీలీక్స్ అసాంజె విడుదల .............. 4
నిజం చెప్పినందుకు అసాంజె క్షోభ ............ 5
సమస్యల సాధనకు పోరుబాట ............................... 7
మీడియా స్వేచ్ఛకు ప్రతీక అసాంజె ......................... 9
టివి ఛానళ్ల ప్రసారంపై నిషేధం తగదు ............ 11
బలహీనపడుతున్న మీడియా స్వేచ్ఛ .......................... 13
రామోజీరావుకు భారతరత్న ....................... 15
జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పొడిగింపు .................................. 16
జర్నలిస్టులకు రాయితీ కల్పించాలి ---------------- 18
ఎంహెచ్ స్మారక అవార్డు ఎంట్రీలకు ఆహ్వానం ..................... 22
నూతన సభాపతికి సత్కారం ....... 26
జర్నలిస్టు ఉద్యమనేత గారపాటి ఉపేంద్రబాబు కన్నుమూత....... 31



సంపాదకులు

ఎ.అమరయ్య

వర్కింగ్ ఎడిటర్స్

ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్

సంపాదకవర్గం

జి.ఆంజనేయులు ఎస్.వెంకట్రావు
వి.నవీన్‌రాజ్ ఎమ్. శ్రీనివాస్
బి.ఎన్.ప్రసాదరావు వి.గోపి
వి.రామారావు ఆర్.రామాంజనేయులు
బి. ఈశ్వరరావు కె.వేణుగోపాలరావు
టి.మద్దులేటి వి.భక్తవత్సలం
ఒ.శాంతి ఎస్.మురళీశంకర్
కె.ఎస్.శంకరరావు జి. శీనుబాబు
డి.మధుసూదనరావు

డిజైనర్:



PUBLISHED, PRINTED AND EDITED BY
G. Anjaneyulu on behalf of
Andhra Pradesh Working
Journalists Federation
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi
Sapphire, Golconda 'X' Roads,
Musheerabad, Hyderabad-500 020, A.P.

PRINTED AT
Prajashakthi, M.B. Bhavan, Near RTC Cross
Roads, Hyderabad-500 020.



EDITOR
A.Amaraiah
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9912199494



RNI No. APMUL/2009/37690

# 'వికీలీక్స్' అసాంజె విడుదల

వికీలీక్స్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజే జూన్ 25వ తేదీ ఉదయం జైలు నుండి విడుదలయ్యారు. అమెరికా న్యాయశాఖతో జరిగిన ఒప్పందంలో భాగంగా ఆయన నేరాన్ని అంగీకరించనున్నట్లు సమాచారం. ఈ వారం పశ్చిమ ఫసిపిక్‌లోని యుఎస్ కామన్వెల్త్ ప్రాంతమైన మరియానా ద్వీపంలో అమెరికా ఫెడరల్ కోర్టు విచారణకు హాజరుకానున్నారు. గూఢచర్యం చట్టం కింద అమెరికా జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని




చట్ట వ్యతిరేకంగా పొందడం, ప్రచురించారన్న నేరాన్ని అసాంజే అంగీకరించనున్నట్లు యుఎస్ న్యాయ శాఖ ఓ లేఖలో ఫీల్డ్ కోర్టుకు తెలిపింది.

అయితే నేరారోపణ అభ్యర్థనను న్యాయమూర్తి తప్పనిసరిగా ఆమోదించాల్సి వుంది. గత కొంతకాలంగా కొనసాగుతున్న రహస్యపత్రాల ప్రచురణ కేసు కొలిక్కి రానుంది. అమెరికా సైన్యంలోని లోపాలను వెల్లడించేందుకు ఆయన ఓ జర్నలిస్టులా వ్యవహరించారంటూ అసాంజేకు పత్రికా స్వేచ్ఛ కోరుకునే పలువురు న్యాయవాదులు మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే.

మరియానా దీవులలో సైపాన్‌లో స్థానిక కాలమానం ప్రకారం విచారణకు హాజరుకానున్నారు. అనంతరం ఆస్ట్రేలియాకు తిరిగి వస్తాడని భావిస్తున్నారు. అమెరికాకు రావడానికి ఆయన నిరాకరించడంతో, అక్కడ విచారణ చేపడుతున్నట్లు సమాచారం. అమెరికా ఆధీనంలో ఉన్న ఆ ప్రాంతం ఆస్ట్రేలియా సమీపంలో ఉంటుంది.


అసాంజే బ్రిటీష్ జైలు నుండి విమానంలో యుకెకి వెళతారని వికీలీక్స్ ప్రకటించింది. మాకు అండగానిలిచిన, మనకోసం పోరాడిన అసాంజే విడుదల కోసం జరిపిన పోరాటంలో కట్టుబడి ఉన్న వారికి కృతజ్ఞతలు అని అన్నారు. వికీలీక్స్ ప్రభుత్వ అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘనల సంచలన కథనాలను ప్రచురించింది. వారి చర్యలకు బలమైన జవాబుదారీగా ఉంది. అసాంజే ఈ సూత్రాల కోసం, ప్రజల హక్కులు తెలుసుకునేందుకు తీవ్రంగా యత్నించారని పేర్కొంది.

# నిజం చెప్పినందుకు అసాంజె క్షోభ

–అనన్య వర్మ

పద్నాలుగేళ్ల పాటు బ్రిటన్, అమెరికా ప్రభుత్వాల పీడనకు గురైన వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే ఎట్టకేలకు స్వేచ్ఛా జీవి కాబోతున్నాడు. ఆయన ఒక ప్రైవేటు విమానంలో పసిఫిక్ మహాసముద్రం మధ్యలోని అమెరికా భూభాగం నుంచి ఆస్ట్రేలియాకు బయలు దేరాడు. ఈ ప్రయాణానికి ఆయనకు పది లక్షల డాలర్లు ఖర్చు అవుతాయి. అంత డబ్బు భరించే ఆర్థిక స్తోమత ఆయనకు లేదు. కానీ ఆయన కుటుంబ సభ్యులు జనం దగ్గర విరాళాలు వసూలు చేసి ఆయన విమాన ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వాల బండారం బయట పెట్టినందుకు ఇంత సుదీర్ఘకాలం వేదన అనుభవించిన పత్రికా రచయిత మరొకరు లేకపోవచ్చు. న్యాయబద్ధంగా వ్యవహరిస్తాం అని చెప్పుకునే అమెరికా ప్రభుత్వ అవకతవకలను సాక్ష్యాధారాలతో సహా బయట పెట్టినందుకు ఆయన ఇంత పీడన, వేదన భరించవలసి వచ్చింది.

స్వేచ్ఛా జీవి కావడానికి ఆయన ఒక నేరం చేశానని అంగీకరిస్తే తప్ప విడుదల సాధ్యం కాలేదు. 1917 నాటి కాలదోషం పట్టిన అమెరికా గూఢచార చట్టం ప్రకారం ఆయన మీద నిరాధారమైన ఆరోపణలు మోపారు. యాభై రెండేళ్ల అసాంజే ఈ నేరం చేసినట్టు ఒప్పుకోవలసి వచ్చింది. తాను పొరపాటు చేసినట్టు ఒప్పుకోక తప్పలేదు. అమెరికా, ఇంగ్లాండ్ లాంటి పాశ్చాత్య దేశాలు ఎంత క్రూరంగా ప్రవర్తించగలవో అసాంజే ఉదంతం రుజువు చేస్తోంది. అసాంజే ఎంత దుర్భరమైన పరిస్థితుల్లో ఇంగ్లాండ్‌లోని అత్యంత భద్రతగల బెల్మార్ష్ జైలులో అయిదేళ్ల రెండు నెలలు ఉండాల్సి వచ్చిందో డాక్టర్ నిల్స్ మెల్జర్ "ది ట్రయల్ ఆఫ్ జూలియన్ అసాంజే" గ్రంథంలో వివరించారు. రెండు మీటర్ల వెడల్పు, మూడు మీటర్ల పొడవు ఉన్న చిన్న జైలు గదిలో ఆయన ఏకాంత జీవితం గడపవలసి వచ్చింది. అందువల్ల ఆయన మానసిక స్థితితోపాటు శారీరకంగా కుంగి పోవాల్సి వచ్చింది. అసాంజేను చిత్రహింసలు పెట్టిన తీరు గమనిస్తే ఇటలీ ఫాసిస్టు పాలకుడు ముస్సోలినీ ప్రసిద్ధ మార్క్సిస్టు మేధావి గ్రాంసీ మెదడు పని చేయకుండా చూడాలని జైలు సిబ్బందిని ఆదేశించిన కిరాతక వైనం గుర్తొస్తుంది. బెల్మార్ష్ జైలులో ఉండడానికి ముందు అసాంజే లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో నిర్బంధ జీవితం గడపవలసి వచ్చింది. బయటకు అడుగుపెడితే ఎవరు ఎప్పుడు చంపేస్తారోనన్న భయం పీడించింది. ఆ తరవాత ఆయనను అరెస్టుచేసి అమెరికా పంపించారు. ఆయన గనక ఇప్పుడు విడుదల కాకపోతే 175 ఏళ్ల పాటు జైలు శిక్ష పడేది. నిర్భీతిగా పత్రికా రచన కొనసాగించడమే ఆయన చేసిన నేరం. ఇప్పటికైనా అసాంజే విడుదలయ్యే వారు కాదు. అమెరికాలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అందువల్ల బైడెన్ ప్రభుత్వం మానవ హక్కుల విషయంలో తాము కడిగిన ముత్యం లాంటి వాళ్లమని ప్రపంచాన్ని నమ్మించడానికి మాత్రమే విడుదల చేసింది. ఇప్పటికే పలస్తీనియన్ల మీద ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న అమానుష



యుద్ధానికి మద్దతు ఇస్తున్నందుకు అమెరికా బోలెడు విమర్శలు ఎదుర్కుంటోంది. తాను చట్ట విరుద్ధంగా సమాచారం సేకరించినట్టు అంగీకరిస్తే వదిలేస్తామని గత 24వ తేదీన అమెరికా న్యాయ మంత్రిత్వశాఖ బేరం పెట్టింది. దీని ప్రకారం అమెరికా అసాంజేకు అయిదేళ్ల జైలు శిక్ష విధించవచ్చు. కాని ఆయన బెల్మార్ష్ జైలులో శిక్ష అనుభవించినందువల్ల ఆ కాలాన్ని శిక్ష అనుభవించినట్టు భావించి "దయ" చూపారు. అందుకే ప్రసిద్ధ రచయిత్రి అరుంధతీ రాయ్ అసాంజేను నెలవు వదిలిన పక్షిగా అభివర్ణించారు. ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదుల అకృత్యాలను అసాంజే బహిర్గతం చేసిన ఉదంతం అసాధారణమైంది. దానికి ఆయన ఎవరూ చెల్లించని మూల్యం చెల్లించవలసి వచ్చింది. 2006లో ఆయన వికీలీక్స్ ప్రారంభించి నప్పటి నుంచి ఇలాంటి అకృత్యాలను బయటపెట్టే పనిలోనే ఉన్నారు. అమెరికా శ్వేతసౌధం దాచేసిన నిజాలను వెల్లడించారు. ఇవి ఒక ప్రభుత్వానికి పరిమితమైనవి కావు. ఇరాకీ పౌరుల మీద అమెరికా యుద్ధ విమాన పైలెట్ నిర్దాక్షిణ్యంగా ఎలా బాంబుల వర్షం

కురిపించాడో అసాంజే వీడియోతో సహా బహిర్గతం చేశారు. దీనికి ఇరాక్, అఫ్గానిస్థాన్‌కు సంబంధించిన అనేక రహస్య పత్రాలను వెలికి తీశాడు. అమెరికా దాడిలో రాయిటర్స్ పత్రికా రచయిత మరణించిన వాస్తవాన్ని అసాంజే బయట పెట్టాడు. గౌటెనామా బేలో 15,000 వేలమంది పౌరుల ప్రాణాలు బలి తీసుకున్న విషయాన్ని బయటపెట్టారు. అమెరికా గూఢచార సంస్థ నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ జపాన్, జర్మనీ ప్రభుత్వాల అధికారుల మీద గూఢచర్యం ఎలా కొనసాగించిందో అసాంజే రుజువు చేశారు. వికీలీక్స్ విడుదల చేసే వార్తలను ఇంగ్లాండ్ లోని గార్డియన్, అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్ అప్పుడు దర్జాగా వాడుకుని గొప్ప పరిశోధనాత్మక వార్తలు వెలికి తీసినట్టు బుజాలు ఎగురవేశాయి. తీరా అసాంజే చిక్కుల్లో పడ్డప్పుడు ఈ పత్రికలు వాటంగా తప్పించుకున్నాయి. కాడి కింద పడేశాయి. అసాంజే ఒంటరి పోరాటం చేయాల్సి వచ్చింది. అసాంజే మీద నిరాధారంగా లైంగిక అకృత్యాలకు పాల్పడినట్టు స్వీడన్‌లో కథ కూడా అల్లి ప్రచారంలో పెట్టారు. అంటే అసాంజే వివిధ ఖండాల్లో శిక్ష, పీడన అనుభవించడమే కాక ఎన్నో దేశాలు మోపిన ఆరోపణలు భరించవలసి వచ్చింది. ఇదంతా కట్టు కథ అని తరవాత ఫోరెన్సిక్ దర్యాప్తులో తేలిపోయింది. నిజానికి అసాంజేను అత్యాచారాలకు పాల్పడేవాడిగా చిత్రించడానికి అమెరికా పాలనా కేంద్రమైన వైట్‌హౌజ్, ఇంగ్లాండ్‌లోని 10 డౌనింగ్ స్ట్రీట్ ఈ కుట్ర చేశాయి. అసాంజే రష్యా తొత్తు అని, డోనాల్డ్ ట్రంప్‌తో కుమ్మక్కై అమెరికా మీద నిందలు వేస్తున్నాడని 2016లో అమెరికా అధ్యక్ష స్థానానికి పోటీపడ్డ హిల్లరీ క్లింటన్ కూడా ఆరోపించారు. ఈ దుష్ప్రచారానికి వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ లాంటి పత్రికలు మరింత ఆజ్యం పోశాయి. ప్రపంచ వ్యాప్తంగా నిష్పక్షపాత పత్రికా రచనకు మద్దతిచ్చేవారు అసాంజేకు అండగా నిలవకపోతే ఆయన జైలు గోడల మధ్య శారీరకంగా కృశించి, మానసికంగా ఎందుకూ కొరగా కుండా తయారై ప్రాణాలు వదలాల్సివచ్చేది. మానవ హక్కుల కార్యకర్తలు, మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడిన న్యాయవాదులు, పత్రికా రచయితలు, మేధావులు అసాంజే మీద జరుగుతున్న దాడిని నిరంతరం వ్యతిరేకించినందువల్లే అసాంజే విడుదల సాధ్యం అయింది. ఆయన ఎదుర్కొన్న వేదన స్వేచ్ఛాయుత దేశాలలో వాస్తవ పరిస్థితికి దర్పణం. అయితే ఆ దర్పణం పగిలి పోయింది. అందులో ఆ దేశాల ముఖ చిత్రాలు కకావికలై కనిపిస్తున్నాయి.

# ఫీజు రాయితీకి ఫెడరేషన్ వినతి



కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితి కల్పించాలని ఎమ్మిగనూరు ఏపీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో మండల ఎంఈఓ ఆంజనేయులకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలకు ప్రజలకు వారతులుగా పనిచేసే ప్రతి వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల్లో ప్రభుత్వం రాయతి కలిపించాలని అలాగే ఏమ్మిగనూరులో ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకువాలని ఏం ఈ వో కు తెలిపారు. అనంతరం ఏం ఈ వో మాట్లాడుతూ ఈ విషయమై ప్రయివేటు పాఠశాల యజమాన్యం వారితో మాట్లాడుతానని జర్నలిస్తుల పిల్లలకు అరవై శాతం రాయితీ కల్పించే ప్రయత్నం చేస్తానని సానుకూలంగా స్పందిస్తూ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిడబ్ల్యూజేఎఫ్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్,ఇలియాస్ మురళి, ఖలీల్, చెన్నయ్య రమేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



**ఏలూరు జిల్లాలో జరిగిన ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన కార్యవర్గ సభ్యులు**




# సమస్యల సాధనకు పోరు బాట

## ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పిలుపు

రాష్ట్రంలో పాత్రికేయులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని సమస్యల సాధనకు పోరాట పంథాయే మార్గమని ఏపీడబ్ల్యూ జే ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు ఉద్బోధించారు. ప్రస్తుతం మీడియా యావత్తు ఇటు ప్రభుత్వం తోను అటు యాజమాన్యపరంగా ఇక్కట్లు నెదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఏలూరు జిల్లా తృతీయ కార్యవర్గ సమావేశం జూన్ 26న ఏలూరులోని పి ఆర్ ట్రైనింగ్ సెంటర్లో జిల్లా అధ్యక్షుడు ఎస్ డి జబీర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు విలేకరుల సాధక బాధలు ప్రస్తావించారు. వారు నడిరోడ్డుపై ఉన్నారని నూతన కూటమి ప్రభుత్వం కొత్తగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారధ్యంలో ఏర్పడిందని అభినందించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం ఇటీవల వరకు అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, మంజూరు విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీలు ఆచరణ రూపం దాల్చలేదన్నారు. చంద్రబాబు నంద్యాల ఉప ఎన్నికల సమయంలో ట్రిబుల్ బెడ్ రూమ్స్ ఇల్లు కట్టిస్తా మని హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చలేదన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుకు మూడుసెంట్ల ఇంటిస్థలం ఇస్తామని జీవో తీసుకువచ్చారని, జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించినా అది కూడా ఆచరణకు నోచుకోలేదన్నారు. ఎన్నికలు జరిగే సమయంలో హామీలిచ్చి మానిఫెస్టోలో పెట్టినా తిరిగి ఎన్నికలు జరిగే నాటికి ఆచరణకు నోచుకోనందున ఎన్నికల కోడ్ అడ్డం వచ్చి ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. అయినప్పటికీ సానుకూల దృక్పథంతో ముందుకు సాగుదాం అంటూ. నూతన కూటమి ప్రభుత్వంతో సానుకూలంగా వ్యవహరించి హామీలు నెరవేర్చేలా చూసుకోవాలన్నారు. సమాచార శాఖ మంత్రి పార్ధ సారథిని రాష్ట్ర బాధ్యులు కలిసి సమయం కోరామని చెప్పారు. హోంమంత్రి వంగలపూడి అనిత, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను కలిసి శుభాకాంక్షలు తెలియజేశామన్నారు. సమాచార శాఖ మంత్రిని కలిసిన సమయంలో ఫెడరేషన్ నాయకులందరితో ఇష్టాగోష్టి సమావేశం నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నామని అందుకు సమయం కేటాయించాలని కోరినట్టు చెప్పారు. కాగా సమావేశంలో మాట్లాడిన రాష్ట్ర కార్యదర్శి కె ఎస్ శంకరరావు జిల్లాలో ఆయా నియోజకవర్గ నేతలు ఎమ్మెల్యేలను కలిసి పరిచయం చేసుకోవాలని తద్వారా సమస్యలు తెలీజెయ్యాల్ని చూచించారు. సమావేశంలో నూతన ప్రభుత్వాన్ని అభినందిస్తూ తీర్మానం చేశారు.గతం లో మాదిరిగా వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ లు ఇవ్వాలనిమరో తీర్మానం చేశారు. కార్యదర్శి వై వి హరీష్ తీర్మానాలు ప్రవేశ పెట్టారు. దెందులూరు కార్యదర్శి వెంకట్ స్వాగతం పలికారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు కె బాల సౌరి,ఏ.కొండబాబు ఉపాధ్యక్షులు,కె సోమ శేఖర్, కె.కిరణ్ కుమార్, కలపాల శ్రీనివాస్, ఋషీ రావు కోశాధికారి చిన్నారావు, పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ గుండా రామకృష్ణ, పి ఎన్వీ రామారావు,కె. లోకేష్ తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల ఇంటి సమస్యపై స్పందించాలి

కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ద్వారానే జర్నలిస్టుల సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు . అర్బన్ అధ్యక్షులు పి నారాయణలు అన్నారు. జులై 1వ తేదీ విశాఖపట్నంలోని డైమండ్ పార్క్ సమీపంలో ఉన్న ఒక హొటల్లో ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్ల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల పెండింగ్ సమస్యలపై కార్యవర్గ సభ్యులంతా చర్చించారు. అనంతరం గంట్ల శ్రీను బాబు, నారాయణలు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల కళ చివరికి కలగానే మిగిలిపోయిందన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం జర్నలిస్టులకు టిట్కో ఇల్లు కేటాయిస్తామని ప్రకటించిన వెంటనే అందుకు సంబంధించిన దరఖాస్తులను కూడా అప్పట్లోనే జర్నలిస్టులు జిల్లా పౌర సంబంధాలు శాఖ కార్యాలయాల్లో అందజేశారన్నారు. అయితే అవి కార్యరూపం దాల్చలేదని ఈ లోగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిని పట్టించుకోలేదన్నారు. ఐదేళ్లపాటు జర్నలిస్టులు సమస్యలను పట్టించుకోకుండా ఎన్నికలకు ముందు మూడు సెంట్లు స్థలాన్ని కేటాయిస్తామని వైసీపీ ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించారన్నారు. అయితే ఈ ప్రక్రియ కూడా నెరవేరలేదన్నారు. కాబట్టి ప్రస్తుత కూటమి ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టుల అక్రిడేషన్‌లతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. తమ జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ఈ విషయాన్ని నివేదించడం జరుగుతుందని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా అందరికీ అక్రిడేషన్లు మంజూరు చెయాలని, అన్ని కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలనీ కోరడం జరుగుతుందన్నారు.

## జులై 13 న విశాఖ జిల్లా మహాసభ

13 న విశాఖపట్నం జిల్లా కార్యవర్గ ఎన్నికలు, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషనణ మహాసభ, నూతన కమిటీ ఎన్నికలతో పాటు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు త్వరలో నిర్వహించేందుకు. ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు జి శ్రీనివాసరావు, ఎపిబిజెఎ విశాఖ జిల్లా అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు,ఎపిడబ్ల్యుజెఎఫ ఉపాధ్యక్షులు బి శివప్రసాద్, పితాని ప్రసాదరావు, ఎన్ రామకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ సాంబరావు, ప్రతినిధులు కె ఎస్ శర్మ, బి ఆనంద్, టి కృష్ణమూర్తి, పి నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# మీడియా స్వేచ్ఛకు ప్రతీక అసాంజె



మొదటినుంచి అమెరికా గొప్ప ప్రజాస్వామిక దేశం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అన్ని దేశాల కంటే ముందంజలో ఉంది. ఆర్థిక అభివృద్ధిలో ప్రథమ స్థానం. అమెరికా డాలర్ ప్రపంచ ఆర్థిక విధానాల తలరాతను మార్చి వేయగలదు. ఇలా అనేక విషయాల్లో అమెరికా ముందు ఉండడంతో అగ్రరాజ్యంగా గుర్తింపు పొందింది. ఇలా అనేక ప్రత్యేకతలతో అమెరికా పాశ్చార్య దేశాలతో పాటు ప్రపంచం అంతటా గౌరవాన్ని పొందింది. అదే సమయంలో అమెరికా అంత స్వార్థపరమైన దేశం మరొకటి లేదు. తన అగ్రరాజ్య హోదా కోసం ఏ దేశాన్ని అయినా తేలిగ్గా బలిపెట్టగలదు. పచ్చని భూములను మరుభూములుగా మార్చగలదు. జపాన్‌పై అణుబాంబులను ఉపయోగించి మానవ మారణ హోమాన్ని సృష్టించింది. తాను తప్ప ఏ దేశమూ పచ్చగా శాంతియుతంగా ఉండడాన్ని సహించలేదు. ఇరుగుపొరుగు దేశాలు సఖ్యతగా ఉంటే చూడలేదు. తన ఆధిక్యత కోసం ఇరు దేశాల మధ్య యుద్ధాలను సృష్టిస్తుంది. ఇరుదేశాలకు మారణాయుధాలను అమ్ముకొని లాభాలు గడిస్తుంది. తన దేశంలో సహజ వనరులను భవిష్యత్ తరాలకు భద్రంగా దాచుకుంటుంది. ఇతర దేశాల వనరులను తన బలంతో తవ్వి తీసి తన దేశ అవసరాలకు వాడుకుంటుంది. పేరు కోసం మానవ హక్కుల గురించి మాట్లాడుతుంది. నల్లజాతి వారిని, నీగ్రోలను సహించదు. జాతి వివక్ష పాటించడంలో అమెరికాదే అగ్రస్థానం. అమెరికాలో స్కూలు పిల్లలు సైతం డ్రగ్స్‌కు బానిసలు. గన్‌కల్చర్ ఎక్కువ. టీచర్లపై తోటి విద్యార్థులపై యథేచ్ఛగా కాల్పులు జరుపుతారు. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా అమెరికాలో క్రైమ్ రేట్ కూడా ఎక్కువే. హత్యలు, దొంగతనం, దోపిడీలు, మానభంగాలు మామూలే. ఇలాంటి అనేక విమర్శలను సమకాలీన ప్రపంచంలో అమెరికా ఎదుర్కొంటున్నది.

ఇలాంటి అమెరికాలో అగ్రరాజ్య ముసుగులో దాగివున్న నయవంచన, దుర్మార్గాలను సాధికారికంగా బయటపెట్టిన ఆస్ట్రేలియాకు చెందిన వికీ లీక్స్ సంస్థ స్థాపకుడు జూలియన్ అసాంజెపై గూడచర్యం ఆరోపణలతో 14 సంవత్సరాలు నిర్బంధించింది. నానా అగచాట్లకు గురిచేసింది. చివరకు ఆయన విడుదల కోసం అమెరికా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఆయన మీద మోపబడిన నేరాన్ని అసాంజె అంగీకరించారు. ఈ నేరానికి ఐదేళ్ల జైలు శిక్షను విధించారు. అయితే అసాంజె బ్రిటన్‌లో ఇప్పటికే అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**

**9849328496**

అనుభవించినందున శిక్షాకాలం పూర్తయినట్లు భావించి ఆయనను విడుదల చేశారు. వెంటనే ఆయన మాతృదేశం ఆస్ట్రేలియాకు ప్రయాణమై క్షేమంగా చేరుకున్నారు. అక్కడ ప్రజల నుండి, ప్రజాస్వామిక వాదుల నుండి ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి కూడా ఘన స్వాగతం లభించింది.

ఇరాక్‌లో అమెరికా దారుణాలను అసాంజె నేతృత్వంలోని వికీ లీక్స్ బయటపెట్టింది. ఇరాక్‌లో అణు ఆయుధాలు, రసాయన ఆయుధాలు ఉన్నాయని తప్పుడు ఆరోపణలు చేసింది. ప్రపంచాన్ని నమ్మించింది. అన్యాయంగా సద్దాం హుస్సేన్‌ను ఉరితీసింది. అలాగే ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దుశ్చర్యలను బయటపెట్టింది. ప్రపంచం ముందు అమెరికాను ఒక దోషిగా నిలబెట్టడమే అసాంజె చేసిన నేరం. అమెరికా లాంటి దేశంలో కట్టుదిట్టమైన రక్షణ వలయాన్ని దాటి అనేక ప్రభుత్వ రహస్య పత్రాలను అధికారిక డాక్యుమెంట్లను

సంపాదించిన సాహసోపేతమైన జర్నలిస్టు అసాంజె. ఒక పరిశోధనాత్మక జర్నలిస్టుగా ప్రభుత్వ దమననీతిని ఎండగట్టడం ఆయన వృత్తి ధర్మం. చెల్సియా మానింగ్ అనే అమెరికా మిలిటరీ అధికారిణి ద్వారా అసాంజె రహస్య పత్రాలను సేకరించారు. ఈ అంశం బయటపడిన తరువాత ఆమె మీద ప్రభుత్వం వివిధ కేసులు మోపింది. సుమారు 35 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా కూడా విధించారు. కానీ ఆనాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆ శిక్ష కాలాన్ని ఏడు సంవత్సరాలకు తగ్గించారు. దానితో 2017లో ఆమె జైలు నుంచి విడుదలైంది. ఆ తరువాత ఏడాది పాటు జైలు శిక్ష, జరిమానా చెల్లించటానికి సిద్ధపడింది. ఆమె అసాంజెకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యం ఇవ్వలేదు. జర్నలిస్టుగా ఒక ప్రభుత్వ నేరపూరిత చర్యను ప్రజలకు తెలపడం అసాంజె బాధ్యత. అందుకు తగిన సాక్ష్యాధారాలను సేకరించి ప్రపంచానికి ఇంటర్నెట్ ద్వారా వికీలీక్స్ సాధనంగా ప్రపంచానికి తెలిపారు. దానికి అమెరికా ప్రభుత్వం అతనిపై కక్ష కట్టింది. ఇప్పటికే అనేకమంది జర్నలిస్టులు పలు దేశాల్లోని ప్రభుత్వ లోపాలను సంచలనాత్మక అంశాలుగా బయటపెట్టి ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు. జర్నలిస్టులు వివిధ మార్గాల్లో వారికి కావలసిన సమాచారం సేకరించడం వారి వృత్తి ధర్మం. వారికి సహకరించి సమాచారం ఇచ్చిన వారి వివరాలు ఎవరికీ ఎప్పటికీ చెప్పకుండా గోప్యత పాటించడం కూడా వారి వృత్తి ధర్మంలో భాగమే. అసాంజెను విడుదల చేయాలి. జర్నలిజం వృత్తిని గౌరవించాలి. మీడియా స్వేచ్ఛను కాపాడాలి అంటూ ఐరోపాతో సహా అనేక దేశాలు, స్వచ్ఛంద సంస్థల నుంచి అమెరికా ప్రభుత్వంపై నానాటికీ ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. ఆ ఒత్తిడి మేరకు ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా అసాంజెతో రాజీ పడవలసి వచ్చింది. అసాంజె ప్రస్తావన వచ్చినప్పుడల్లా అమెరికా ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడిందా అని భావితరాలు తెలుసుకునేందుకు ఈ ఉదంతం తోడ్పడింది. పైగా రహస్యపత్రాలను ముద్రించినందువల్ల లేదా ఇంటర్నెట్ ద్వారా అందుబాటులో ఉంచినందువల్ల జరిగిన నష్టం ఏమిటో రుజువు చేసేందుకు అమెరికా వద్ద ఎలాంటి సాక్షాధారాలు లేవు. అందుకే కేసును విచారించిన న్యాయమూర్తి కూడా అదే అభిప్రాయం తన తీర్పులో చెప్పాడు. అలాగే అసాంజె భార్య స్టెల్లా యావత్తు తన భర్త కేసుకు సంబంధించిన వివరాలను సమాచార స్వేచ్ఛ హక్కు చట్టం కింద అమెరికా నుంచి సంపాదించి లోకానికి వెల్లడించాల్సిందిగా తోటి జర్నలిస్టులకు విజ్ఞప్తి చేసింది. కేసు నడిచినంత కాలం భర్తకు అండగా నిలిచిన ధీరవనితగా ఆమె చరిత్ర కెక్కింది. ఆమెను అందరూ అభినందిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం ఈ కేసుతో జర్నలిజాన్ని ఒక నేరంగా మార్చింది. వార్తల సేకరణ ప్రచురణను నేరంగా పరిగణించింది. తోటి జర్నలిస్టులు వాస్తవాన్ని గ్రహించి కేసు తీరుతెన్నులను బహిర్గత పరచాలని అసాంజె భార్య స్టెల్లా యావత్ ప్రపంచానికి విజ్ఞప్తి చేసింది. అసాంజె ఉదంతంతో పరిశోధనాత్మక జర్నలిజం ఇక ముందు కూడా ఆగదు తమ పాలకుల దుర్మార్గాలను వెల్లడించాలని చిత్తశుద్ధితో పనిచేసే జర్నలిస్టులకు ఈ ఉదంతం ఒక ధైర్యాన్ని ఇచ్చింది. ఇకముందు ఈ స్ఫూర్తి కొనసాగుతుంది. మీడియా స్వేచ్ఛ దేశద్రోహం కాదు. ప్రజల పక్షాన నిలవడమే జర్నలిజం వృత్తి ధర్మం. ప్రతి ఒక్క జర్నలిస్టుకు అసాంజె ఒక రోల్ మోడల్. నియంతృత్వ ప్రభుత్వాలకు ఒక హెచ్చరిక కూడా. మన దేశంలో కూడా అనేక పేరు మోసిన పత్రికలు ప్రఖ్యాత మీడియా సంస్థ సంస్థలు చానళ్ళు, కార్పొరేట్లు ఆదాని, అంబానీ చేతుల్లోకి వెళ్ళిపోయాయి. అవి స్వలాభం కోసం అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు బాకా కొదుతున్నాయి. నిజమైన ప్రజా సమస్యలను చర్చకు పెట్టడం లేదు. గత పదేళ్లుగా ప్రధాన మీడియా కట్టు బానిసలుగా కేంద్ర ప్రభుత్వానికి ఊడిగం చేసి ప్రపంచం దృష్టిలో అభాసు పాలయింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గోడి మీడియా చెప్పిన కల్పిత సర్వే ఫలితాలు జోస్యాలు తిరగబడ్డాయి. వారు అధికార పార్టీ నేతను (మోడీని) ఇంటర్వ్యూ చేసిన విధానం వారు అడిగిన ప్రశ్నలు, పొగడ్తలు ప్రపంచం ముందు అప్రదిష్టను మూటగట్టుకున్నాయి. ఇప్పుడు దేశంలో మోడీ మీడియాను నమ్మే నాధుడు కరవయ్యాడు. ఆ చానళ్లలో ఊదరగొట్టే చర్చలను, అరుపులను, కేకలను వినే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నది. ధ్రువ్‌రాఠీ, రవీష్ కుమార్ లాంటి ఇండిపెండెంట్ యూట్యూబర్లకు గిరాకీ పెరిగింది. వారి వీడియోలకు అమాంతంగా వీక్షకులు లక్షల్లో పెరిగారు. వారు ప్రజాస్వామ్యంలో సామాన్య ప్రజల గొంతుకను వినిపిస్తున్నారు. మన తెలుగులో ప్రొఫెసర్ నాగేశ్వర్, వీక్షణం వేణుగోపాల్, డాక్టర్ ప్రసాద్ మూర్తి, మహిళా జర్నలిస్టుల్లో వనజ, తులసి చందు మొదలైన యూట్యూబర్లకు వీక్షకుల ఆదరణ క్రమంగా పెరుగుతున్నది. పేరు మోసిన పెద్ద పత్రికలు ఏదో పార్టీతో జతకట్టడంతో నిష్పాక్షిక వార్తలను చేరవేసే చిన్న పత్రికలకు ప్రజలలో ఆదరణ పెరుగుతున్నది.

# టివి ఛానళ్ల ప్రసారంపై నిషేధం తగదు

## ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

సాక్షి టీవీ' సహా టీవీ9, ఎన్‌టివి, 10టివి ప్రసారాలను ఆంధ్రప్రదేశ్‌లో చట్టవిరుద్ధంగా నిలిపివేయడంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ కక్షలకు వార్తా ఛానళ్లను బలి చేయొద్దని సూచించింది.

'సాక్షి టీవీ' సహా టీవీ9, ఎన్‌టివి, 10టివి ప్రసారాలను ఆంధ్రప్రదేశ్లో తక్షణం పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రసార మంత్రిత్వ శాఖ ఢిల్లీ హైకోర్టు పరిధిలో ఉండడం వల్ల ఈ కేసులో ఢిల్లీ హైకోర్టును న్యూస్ బ్రాడ్కాస్టర్స్ ఫెడరేషన్-ఎన్‌బిఎఫ్ ఆశ్రయించగా న్యాయస్థానం ఈ ఉత్తర్వులిచ్చింది. టివి9, సాక్షి, 10టీవీ, ఎన్‌టివి న్యూస్ ఛానెల్స్ ప్రసారాలను పునరుద్ధరించాలంటూ 15 మంది మల్టీ సిస్టమ్ ఆపరేటర్లను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది.

ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త సంస్కృతి పరిఢవిల్లుతున్నది. ఫలితంగా మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు ప్రత్యేకించి క్షేత్రస్థాయిలో పనిచేసేవారు ఇబ్బందులను ఎదుర్కొనడమే కాక కష్టాల పాలవుతున్నారు. దీనికి ప్రభుత్వంతో పాటుగా యాజమాన్యాల వైఖరి కూడా కారణం కావడం విచిత్రం. తమిళనాడులో గతంలో ఈ సంస్కృతి చాలా తీవ్రస్థాయిలో ఉండేది. రాజకీయ పార్టీలు స్వయంగా మీడియా సంస్థలు నడపడం వల్ల వచ్చిన సమస్యగా అక్కడున్నవారు భావించేవారు. తెలుగునాట మాత్రం మీడియా యాజమాన్యాలు కూడా అగ్నికి ఆజ్యం పోశాయి. ఫలితంగా మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులను కూడా రాజకీయ పార్టీల లేబుళ్ళతో చూస్తున్న పరిస్థితి గత కొంత కాలంగా కనిపిస్తున్నది. ఎవరు అధికారంలో ఉన్నా సమాచారం ఇచ్చే విషయంలో నిస్పాక్షికంగా మీడియా వ్యవహరించాలి. ఎవరు తప్పుచేసినా వాటిని ఎత్తిచూపి సరిచేసే ప్రయత్నం చేయాలి. ప్రభుత్వ వ్యవస్థలోని లోపాలకు కారకులెవరో సాక్ష్యాధారాలతో చెప్పడమంటే జర్నలిస్టు వృత్తి ధర్మాన్ని నిర్వర్తించడం. వృత్తిధర్మాన్ని నిర్వహించడంలో ఎదురయ్యే అనేక ఆటుపోట్లను తట్టుకునేందుకు జర్నలిస్టు సిద్ధపడాలి. వారికి తాము పనిచేస్తున్న సంస్థ యాజమాన్యం సంపూర్ణ సహకారం అందించాలి.

కానీ పరిస్థితి మారిపోయింది. ఢిల్లీ నుంచి గల్లీ దాకా యాజమాన్యాల వైఖరిలో, ప్రభుత్వ ధోరణి తదనుగుణంగా లేదు. యాజమాన్యాల వ్యాపార ప్రయోజనానికి ప్రథమ తాంబూలం ఇస్తున్నారు. ఏది తమకు లాభార్జనకు అనుకూలమో ఆ బాట పడుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకుని రాజకీయ పార్టీలు తమ ప్రయోజనాల ప్రాతిపదికన మీడియా సంస్థలను వినియోగించుకుంటున్నారు. మీడియాలో కీలక భూమిక పోషించే జర్నలిస్టులు, ఇతర సిబ్బందికి ఆయా సంస్థల్లో పనిచేసేందుకు గల అవకాశాలు ఎంత మెరుగ్గా ఉన్నాయి, చట్టబద్ధంగా అన్నీ అమలు జరుగుతున్నాయా అని పట్టించుకునేందుకు శ్రద్ధ పెట్టడం కంటే అరకొర సదుపాయాలు కల్పించి హామీలతో జర్నలిస్టుల్ని, ఇతర సిబ్బందిని బుజ్జగించే ప్రయత్నం చేయడానికి మాత్రమే పరిమితమవుతున్నారు. మీడియా సంస్థలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఇతర సిబ్బంది ఉద్యోగ భద్రత, కార్మిక చట్టాల అమలుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధం కావడం లేదు. తమకు అండగా నిలుస్తారనుకునే మీడియా సంస్థలకు ప్రకటనలు, రాయితీలు, ఇతర సదుపాయాలు కల్పించే ప్రభుత్వం అందులో పనిచేసే జర్నలిస్టులు, ఇతర సిబ్బందికి యాజమాన్యాలు ఇవ్వాల్సిన చట్టబద్ధ సదుపాయాల అమలు పర్యవేక్షించే బాధ్యతను మాత్రం విస్మరిస్తున్నారు.

తమకు అనుకూలంగా లేని మీడియా సంస్థలపై కేసులు బనాయించడం, అరెస్టులు చేయించడం, దాడులకు తెగబడడం జరుగుతోంది. ఇప్పటికే సమాజంలో వైషమ్యాలు పెచ్చుపెరుగుతున్నాయి. కుల, మత, ప్రాంత విద్వేషాలకు తోడుగా రాజకీయ పార్టీల చదరంగంలో లాభార్జన ప్రధానమై ప్రజాప్రయోజనం మీడియాకు లుప్తమైతే అంతరాలు మరింతగా పెరుగుతాయి. రాజకీయ పరమైన అంతరాల వల్ల సమాజంలో అశాంతి ప్రబలుతుంది. ఈ ధోరణికి ఇప్పటికైనా అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నం జరగాలి. దీనికి ముందుగా యాజమాన్యాలు నడుం కట్టాలి. లాభార్జన యావలో పడి సంస్థలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బంది, జర్నలిస్టుల కష్టాలను దృష్టిలో పెట్టుకోవాలి. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలతో పాటు ఇతర రాజకీయ పక్షాలు మీడియా స్వేచ్ఛగా పనిచేసేందుకు వీలైన వాతావరణం కల్పించాలి.




# నూతన మంత్రులకు ఫెడరేషన్ అభినందనలు

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువు తీరింది. మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసినవారు అనంతరం సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఫెడరేషన్ నాయకులు సచివాలయంలో పదవీబాధ్యతలు తీసుకున్న మంత్రులను కలిసి అభినందనలు తెలియజేశారు. సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కె.పార్ధసారధి, రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖామంత్రి వంగలపూడి అనిత, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌లను ఫెడరేషన్ ప్రతినిధివర్గం కలిసి అభినందనలు తెలియజేసింది. జర్నలిస్టులతో ఇష్టాగోష్టి సమావేశం ఏర్పాటు చేస్తామని దానికి హాజరు కావాలని కోరిన వెంటనే మంత్రులు తమ సమ్మతిని తెలియజేశారు. జర్నలిస్టుల ఆరోగ్యబీమా, జర్నలిస్టుల ఇళ్లస్థలాలు, జర్నలిస్టుల పెన్షన్, సమగ్రబీమా, ఉద్యోగ భద్రత తదితర సమస్యలతో జర్నలిస్టు వృత్తి భారంగా మారింది. వీటికి తోడు జర్నలిస్టులపై పెరిగిన దాడులు తక్కువేమీ కాదు. సంక్షేమం విషయం సరేసరి. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల కోసం సంక్షేమనిధి కమిటీ, దాడుల నిరోధానికి రాష్ట్రస్థాయిలో హైపవర్ కమిటీ, జిల్లాల్లో ఉన్నతస్థాయి పోలీసు అధికారులతో కమిటీల ఏర్పాటుకు అవకాశం ఉంది. వాటి నియామకం జరగడం లేదు. జర్నలిస్టు వృత్తిని ప్రోత్సహించేందుకు అనేక అవార్డులు ఉన్నప్పటికీ చాలాయేళ్లుగా వాటి ఊసెత్తడం లేదు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రులను కలిసిన ఫెడరేషన్ ప్రతినిధివర్గంలో ఏపీడబ్ల్యుజేఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కలిమిశ్రీ, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు గోరంట్లప్ప, సురేష్ బాబు కుర్రా, వై.డి.ఆనంద్, హరితాంధ్ర హరికృష్ణ, ఎపిబిజెఎ నాయకులు వి.శ్రీనివాసరావు, ఆవుల రమేష్‌లు వున్నారు.






# బలహీన పడుతున్న మీడియా స్వేచ్ఛ

**నంటూ బెనర్జీ**


ప్రపంచవ్యాప్తంగా పత్రికలు మీడియా స్వేచ్ఛ రోజుకి బలహీన పడుతోంది. కొన్ని దేశాల్లో ప్రభుత్వాలు జర్నలిస్టులపై నిరంకుశంగా వ్యవహరిస్తూ తమ రహస్యాలను బయటపెట్టినందుకు జర్నలిస్టులపై నిరంకుశంగా వ్యవహరిస్తూ చంపివేసిన ఘటనలు ఉన్నాయి. 30 దేశాల్లో 360 మంది జర్నలిస్టులు పాలకుల రహస్యాలను కనిపెట్టినందుకుగాను అరెస్టు చేసి నీళ్లలో నిర్బంధించిన కేసులు ఉన్నాయి. ఇలాంటి వందల కేసుల్లో వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజె కేసు అత్యంత హృదయ విదారకమైనది. అమెరికా నిఘా చట్టాన్ని ఉల్లంఘించారని కేసు బనాయించి జైల్లో పెట్టారు. అసాంజె స్వేచ్ఛ పొందటానికి ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనెస్ సహాయం చేశారు. అమెరికా ఏ దేశంలో ఎన్ని అకృత్యాలు నిర్వహించింది, అమెరికా నిఘా సంస్థ ఎన్ని ప్రభుత్వాలను కూల్చి వేసింది, ఇంకా అనేక విషయాలను బయటపెట్టి తమను అప్రతిష్ట పాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేసి అమెరికా అసాంజెను కష్టాలపాలు చేసింది. ఆస్ట్రేలియా దౌత్యపరంగా సహకరించి అమెరికాతో చర్చలు జరిపిన తర్వాత ఎట్టకేలకు అసాంజెకు విముక్తి లభించింది. తాను తప్పు చేసినట్లు అసాంజె అంగీకరించడం వల్లనే స్వేచ్ఛ లభించింది. 14 ఏళ్లపాటు అసాంజె న్యాయపోరాటం చేశారు. ఆస్ట్రేలియా సంఘీభావం ఆయనకు లభించింది. అసాంజె జన్మించిన దేశం ఆస్ట్రేలియా. అంతిమంగా అమెరికా అసాంజెను శిక్ష నుంచి మినహాయించి క్షమాభిక్ష పెట్టింది. అమెరికా సైనిక పత్రాలను ఇరాక్ ఆఫ్ఘనిస్తాన్లపై అమెరికా చేసిన దాడులకు సంబంధించిన వీడియోలను అసాంజె బయటపెట్టారు. ఏ దేశంలో ఎన్ని ఘోరాలకు నేరాలకు అమెరికా పాల్పడిన అంశంపై 'హిట్‌మాన్' పేరుతో పుస్తకం రాసి అమెరికా నిఘా విభాగానికి చెందిన రచయిత వారి గుట్టంతా బయటపెట్టారు. అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి చేసి అనేకమందిని కస్టడీలోకి తీసుకొని అమెరికాలో ఖైదు విధించింది. మానవ హక్కులను ఉల్లంఘించి పౌరులను చంపివేశారు. ప్రభుత్వాలే కాకుండా అనేకమంది ఉన్నత స్థానాల్లో ఉన్న నాయకుడు చేసిన అక్రమాలను సైతం బయట పెట్టాడు. ప్రత్యేక సమాచారం పేరుతో రహస్యంగా దాచిన చర్యలను అసాంజె తన సామర్థ్యంతో వెలుగులోకి తీసుకొచ్చారు. ఆయన బ్రిటన్‌లో అత్యున్నత భద్రత కలిగిన జైలులో ఐదేళ్లకు పైగా శిక్ష అనుభవించారు. లండన్ లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో ఏడేళ్లపాటు ఆశ్రయం పొందారు. ఆ తరువాత ఆయనపై అత్యాచారం కేసు నమోదయింది. అదే కాకుండా 18 క్రిమినల్ కేసులను కూడా ఆయనపై మోపాడు. ఆయన ఇలాగే కొనసాగినట్లయితే అమెరికా జైలులో జీవితాంతం ఉండవలసి వచ్చేది. ఆఫ్ఘనిస్తాన్ ఇరాక్‌లపై అమెరికా సైన్యం దాడులకు సంబంధించి సైనిక రహస్య పత్రాలను కూడా అసాంజె బయట పెట్టారు. ప్రపంచంలో బహుశా ఇలాంటి సాహస చర్యలను ఏ జర్నలిస్టు నిర్వహించలేదు. తప్పులు చేసిన వారి తప్పులను బయటపెట్టినందుకే వికీ లీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజెను ఎనలేని కష్టాలకు గురి చేశారు. చివరకు తన తప్పు లేకపోయినా తప్పు చేసినట్లు కోర్టులో అంగీకరించడంతో స్వేచ్ఛ కల్పించారు. ఆయన ఆస్ట్రేలియాకు చేరుకొని కుటుంబంతో కలిసి ఎంతో సంతోషాన్ని వెలిబుచ్చారు. కుటుంబ సభ్యులు కూడా దీర్ఘకాలం తరువాత ఇంటికి వచ్చిన అసాంజెను హృదయపూర్వకంగా ఆహ్వానించారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ రిపోర్టర్ వివాన్ జర్షింకోవిచ్‌ను 15 నెలలుగా మాస్కో జైలులో నిర్బంధించడంపై పశ్చిమదేశాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. అమెరికాకు 1500 కిలోమీటర్ల దూరంలో విచారణ జరుపుతున్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ కోసం వార్తలు అందించే వివాన్ పైన కూడా నిఘా చట్టాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ జైల్లో పెట్టారు. అలాగే వాల్ స్ట్రీట్‌కు చెందిన పాకిస్తాన్‌లో పనిచేసిన విలేఖరి డేనియల్ పెరల్‌ను పోలీసులు అపహరించుకొని పోయి చంపివేశారు. వివాన్ పాకిస్తాన్‌లోని కరాచీలో ఉంటున్న ముబారక్ అలీ జిలానీని ఇంటర్వ్యూ చేసేందుకు వెళ్లారు. ఇదేవిధంగా సౌదీ జర్నలిస్ట్ జమాల్ అహ్మద్ ఖషోగ్గి కూడా హింసకు గురయ్యారు. ఆయన అల్ అరబ్ న్యూస్ ఛానల్‌కు ప్రధాన ఎడిటర్‌గా చేశారు. 'మిడిల్ ఈస్ట్ ఐ' లో క్రమం తప్పకుండా ఒక కాలం రాసేవారు. వాషింగ్టన్ పోస్టుకు ఆయన విలేకరిగా పనిచేశారు. ఆయనను ఇస్తాంబుల్ లోని సౌదీ రాయబార కార్యాలయంలో సౌదీ ప్రభుత్వ ఏజెంట్లు చంపి

వేశారని ఆరోపణలు ఉన్నాయి. సౌదీ రాచరిక కుటుంబానికి అత్యంత సన్నిహితుడు ఖషోగ్గి వాషింగ్టన్ పోస్టుకు నెలవారి రాసే వ్యాసంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ దేశపాలకుడిగా వ్యవహరించారు. ఎక్కువ సంవత్సరాలు గడపకుండానే ఖతార్ నుంచి ఇంగ్లీష్ ఛానల్ అల్ జజీరాకు ఖతార్‌లో ఉంటూ ముగ్గురు జర్నలిస్టులు పనిచేశారు. వారు ఆస్ట్రేలియన్ పీటర్ గ్రస్టీ, కెనడియన్ మహమ్మద్ ఫామి, ఈజిప్ట్‌కు చెందిన బహార్ మహమ్మద్‌లను ఈజిప్టు భద్రతా దళాలు కస్టడీలోకి తీసుకొని దేశభద్రతను దెబ్బతీశారని కేసు నమోదు చేసి జైల్లో పెట్టారు. వారిని నేరస్తులుగా పరిగణించి ఏడు నుంచి పదేళ్ల పాటు జైలు శిక్ష విధించారు. అయితే అధ్యక్షుడు వారిని మన్నించి క్షమాభిక్ష పెట్టారు. జర్నలిస్టులను కాపాడేందుకు న్యూయార్క్‌లో ఒక కమిటీ ఏర్పడింది. అది లాభ రహిత సంస్థ. ప్రపంచవ్యాప్తంగా విలేకరుల స్వేచ్ఛను మరింత పెంపొందించేందుకు పనిచేస్తున్నది. గత సంవత్సరం వరకు 30 దేశాల్లో 363 మంది జర్నలిస్టులను నిర్బంధించింది. ఎక్కువమంది జర్నలిస్టులను ఇరాన్, చైనా, మయన్మార్ దేశాలలో గత సంవత్సరం సిపిజే నివేదిక ప్రకారం ఇండియాలో ఏడుగురు జర్నలిస్టులను నిర్బంధించారు. వీరిని మూడేళ్ల పాటు జైలులో నిర్బంధంలో ఉంచారు. వీరిలో నలుగురిపై క్రూరమైన చట్టాన్ని మోపారు. జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వ రక్షణ చట్టం కింద అరెస్టు చేశారు. నిర్బంధించిన వారిలో కాశ్మీర్ నుంచి పనిచేసే అసిఫ్ సుల్తాన్ అలాగే కశ్మీర్‌కు చెందిన సజాద్ గుల్, ఇండిపెండెంట్ జర్నలిస్టులు రూపేష్ కుమార్ సింగ్, గౌతం నవలఖా, మజీద్ హైదరి, ఇర్ఫాన్ మెహరాజ్, ప్రబీర్ పురకాయస్థ (న్యూస్ క్లిక్) ఉన్నారు. ఇంఫాల్ నుండి ప్రచురితమవుతున్న హైయన్ లాన్‌పావ్ పత్రికకు పనిచేస్తున్న జర్నలిస్టును ఈ సంవత్సరం జనవరి 5న అరెస్టు చేశారు. మతాలు, జాతుల మధ్య వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారు అంటూ జర్నలిస్టులను అరెస్టు చేశారు. అయితే ఈ అరెస్టుల గురించి ఎక్కువ ప్రాంతాలకు తెలియదు. అలాగే ప్రబీర్ పురకాయస్థ అరెస్టు కూడా ఎక్కడ అంతగా తెలియదు. ఉన్నత స్థాయి విద్యార్హత కలిగిన టెలికాం ఇంజనీరు, సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్న నవలఖా ఢిల్లీ సైన్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యుడు. ఆయనను అరెస్టు చేసి తీహారు జైల్లో 2023 నవంబర్ రెండవ తేదీన పెట్టారు. ఇటీవల సుప్రీంకోర్టు ప్రబీర్ పురకాయస్థ అరెస్టు చెల్లదని తీర్పునిచ్చింది. అంత క్రితం ఢిల్లీ లోయర్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కోర్టు విధించిన శిక్ష మూలంగానే మొదట ఆయన జైలుకు వెళ్లారు. 74 ఏళ్ళ జర్నలిస్టును అక్రమ కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద అరెస్టు చేశారు. చైనాకు అనుకూలంగా ప్రచారం చేసేందుకుగాను విదేశాల నుంచి ఆయనకు నిధులు లభిస్తున్నాయి అన్న ఆరోపణలపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పైగా చార్జిషీట్‌లో వార్తల సిండికేట్ల కుంభకోణం అని పేర్కొన్నారు. అంతేకాదు సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్ ఇంకా ఇతర కాలమిస్టులకు పురకాయస్థ నిధులు అందజేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అన్ని మీడియా వేదికలు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ ప్రచార సాధనాలు ప్రజాప్రయోజనం కోసం తమ ఆలోచనలను వెలుగులోకి తెచ్చేందుకు వారికి అన్ని హక్కులు ఉంటాయి. భారత ప్రభుత్వం అధికారిక రహస్యాల చట్టాన్ని అణచివేసే చట్టం, హక్కు గల సమాచార చట్టం (2005) మధ్య సమతుల్యత ఉంచేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# నూతన డిజిపికి అభినందనలు



నూతన డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. పుష్పగుచ్ఛానికి బదులుగా వినూత్నంగా 'మాట' పై ప్రసిద్ధ కవి చిన్ని నారాయణరావు రాసిన దీర్ఘకావ్యాన్ని డీజీపీకి అందజేశారు. నూతనంగా నియమితులైన డిజిపి సాహిత్యాభిమాని, కార్టూన్ ఇష్టులు, వివాద రహితులు. డీజీపీని కలిసినవారిలో ఏపీడబ్ల్యుజెఎఫ్ ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ, ఫెడరేషన్ నాయకులు సురేష్ బాబు కుర్రా, వై.డి. ఆనంద్ వున్నారు.



# 'రామోజీరావుకు 'భారతరత్న' సాధించాలి

**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**


ఈనాడు అధినేత రామోజీరావు సేవలను దృష్టిలో పెట్టుకుని కేంద్రప్రభుత్వం భారతరత్న ఇచ్చేట్లు చూసే బాధ్యత మనందరిపై ఉన్నదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఆయన విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభలో ప్రసంగిస్తూ ఈ విషయాన్ని ప్రస్తావించారు. విజయవాడలో రామోజీరావు సంస్మరణ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రామోజీరావుతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈనాడు పత్రిక ద్వారా రామోజీరావు సమాజహితం కోసం పాటుపడ్డారని, జీవితాంతం విలువలకు కట్టుబడి బతికారని వెల్లడించారు. ఎవరూ తన వద్దకు రావాలని ఆయన కోరుకోరని స్పష్టీకరించారు. ఎన్ని కష్టాలు వచ్చినా రాజీ పడే వ్యక్తి కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజధాని అమరావతి పేరును ఆయన సూచించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ఆయన సమాజాభివృద్ధికి చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం భారతరత్న ఇవ్వడం సముచితంగా ఉంటుందని అంటూ అమరావతి రాజధాని ప్రాంతంలో ఆయన సేవలకు గుర్తుగా ఒక స్మారక మందిరాన్ని నిర్మిస్తామని చెప్పారు. రామోజీరావు స్థాపించిన వ్యవస్థ ఆయన కుటుంబానిదే కాదు, 10 కోట్ల తెలుగు ప్రజలది. ఆయన ప్రజల ఆస్తి. ఆయన స్థాపించిన వ్యవస్థలను భావితరాలకు అందించే బాధ్యతను కుటుంబ సభ్యులు తీసుకుంటే తోడుగా నిలుస్తామని చంద్రబాబునాయుడు చెప్పారు. అమరావతిలో రామోజీరావు పేరిట విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తాం. ఢిల్లీలో ఉన్న విజ్ఞాన్ భవన్ తరహాలో... సమావేశాలు, పరిశోధనలు, అధ్యయనాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు వేదికగా నిలిచే విధంగా రామోజీ విజ్ఞాన కేంద్రం తీర్చిదిద్దుతాం. ఒక రోడ్డుకు కూడా రామోజీరావు మార్గ్ అని నామకరణం చేస్తాం. విశాఖలో సినిమా షూటింగుల నిమిత్తం రామోజీరావు చిత్రనగరి పేరుతో అందుబాటులోకి తీసువస్తామన్నారు. రామోజీరావు మెమోరియల్ కోసం ఏం చేయాలో ప్రజలు సూచనలు, సలహాలు ఇవ్వాలి... దీనిపై రామోజీరావు కుటుంబ సభ్యులతో కూడా చర్చించి మెమోరియల్ నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

ఈ సభలో ఆయనతో పాటు డిప్యూటీ ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్, ది హిందూ దినపత్రిక పూర్వ చీఫ్ ఎడిటర్ ఎన్.రామ్, రాజస్థాన్ పత్రిక సంపాదకులు కొఠారి, సినీ టివి రంగ ప్రముఖులు శ్యామ్‌ప్రసాదరెడ్డి, సంగీత దర్శకులు కీరవాణి, తాడికొండ శాసనసభ్యులు శ్రావణ్‌కుమార్‌లు ప్రసంగించారు. తొలుత సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కె.పార్ధసారథి ఆహుతులకు స్వాగతం పలికి సంస్మరణ సభ ఏర్పాటు గురించి తెలియజేశారు.

డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రసంగిస్తూ ప్రత్యర్థులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా తట్టుకుని నిలబడ్డారని, విలువల కోసం తపనపడ్డారని చెప్పారు. ది హిందూ పూర్వ చీఫ్ ఎడిటర్ ఎన్.రామ్ మాట్లాడుతూ ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షులుగా ఉన్న సమయంలో మీడియా కోసం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. రాజస్థాన్ పత్రిక సంపాదకులు కొఠారి నాలుగు దశాబ్దాలుగా రామోజీరావుతో తనకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సభాప్రాంగణంలో రామోజీరావు చేసిన సేవలను తెలియజేసే చిత్రప్రదర్శనను ఏర్పాటు చేశారు. సభకు విచ్చేసిన ప్రముఖులు తొలుత ఆ ప్రదర్శనశాలను వీక్షించి సభాప్రాంగణానికి చేరుకున్నారు. సభలో రామోజీరావు చిత్రపటానికి ముఖ్యమంత్రితో పాటు వేదికపై ఉన్నవారు పుష్పాలు



సమర్పించి నివాళులర్పించారు. రామోజీరావు కుటుంబసభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సంస్మరణ సభను ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వానికి రామోజీరావు కుమారుడు కిరణ్ కృతజ్ఞతలు తెలియజేసి తమ కుటుంబం తరపున రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధి కోసం రామోజీరావు స్మత్యర్థం పదికోట్ల రూపాయలు విరాళంగా అందజేశారు. మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్ శైలజ, రామోజీ ఫిల్మ్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్ విజయేశ్వరి, రామోజీరావు మనుమలు ఈ కార్యక్రమంలో భాగం పంచుకున్నారు.



**ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా పి.హరిప్రసాద్ ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం జనసేన పార్టీలో పవన్‌కళ్యాణ్ రాజకీయ కార్యదర్శిగా ఉన్నారు. గతంలో జర్నలిస్టుగా ఈటివి, మాటివి, సివిఆర్ న్యూస్‌తో పాటు పలు సంస్థల్లో పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హరిప్రసాద్‌కు అభినందనలు తెలియజేస్తోంది.**

# జర్నలిస్టుల అక్రిడేషన్ గడువు పొడిగింపు

తెలంగాణలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ (గుర్తింపు) కార్డు గడువును మరో మూడు నెలల (సెప్టెంబర్ 30) వరకు పొడిగిస్తూ తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు పై తగు చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల కోసం ప్రతి రెండేళ్లకు ఒకసారి అక్రిడిటేషన్ కార్డుల సదుపాయం రాష్ట్ర సమాచార శాఖ కల్పిస్తోంది. ఈ గడువు జూన్ 30తో ముగిసినందువల్ల దాన్ని సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు ఉత్తర్వుల్లో తెలియజేశారు. సమాచార శాఖ వద్ద అక్రిడిటేషన్ స్టిక్కర్ వేయించుకుని బస్‌పాస్ సదుపాయం పొందవచ్చు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటు జూన్ 30 వరకు కొనసాగింది.



# జర్నలిస్టుల పిల్లలకు విద్యలో 50 శాతం రాయితీ ఇవ్వాలి

## ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్

జర్నలిస్టుల పిల్లలకు విద్యలో 50శాతం రాయితీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ జి మద్దయ్య యాదవ్ డిమాండ్ చేశారు. జూన్ 23న పాణ్యంలోని ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీడబ్ల్యూజేఎఫ్ కర్నూలు జిల్లా కన్వీనర్ కే. నాగేంద్ర, నంద్యాల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎ.జగన్మోహన్, పాణ్యం నియోజకవర్గం- ప్రధాన కార్యదర్శి సుజాత బనగానపల్లె నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎం రామచంద్రారెడ్డి లో హాజరయ్యారు . నియోజకవర్గ గౌరవ అధ్యక్షులుగా ఆంధ్రప్రభ విలేకరి వై. రంగస్వామి, అధ్యక్షులుగా ప్రజాశక్తి విలేకరి సి. రమేష్ ,ఉపాధ్యక్షులుగా విశాలాంధ్ర విలేఖరి బి శ్రీనివాసులు, కార్యదర్శిగా గడివేముల మనం విలేకరి జి .ప్రసాద్, కార్యదర్శిగా గడివేముల ఆంధ్ర అక్షర విలేకరి రసూల్ సాహెబ్, ట్రెజరర్ గా సస్య టీవీ రిపోర్టర్ నబి హుస్సేన్, కార్యవర్గ సభ్యులుగా గడివేముల శ్రీ ప్రస్థానం విలేకరి డి చెన్నయ్య రాయలసీమ విలేకరి కే రాజేష్ బాబు ప్రజా పోరాటం విలేకరి పిచిందన్న లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాణ్యం గడివేముల మండలాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మద్దయ్య యాదవ్, నాగేంద్ర లు ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఎలాంటి నిబంధనలు లేకుండా ఇంటి స్థలాలు పక్కా గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు, గత ప్రభుత్వంలో ఎన్నికలకు ముందు జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జాబితాను తయారు చేశారని




ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిందన్నారు నూతన ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇంటి స్థలాలు పక్క గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులో నూతన ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు జర్నలిస్టులో తమ సమస్యల సాధన కోసం హక్కుల సాధన కోసం ఐకమత్యంతో పోరాటం చేయాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ నాయకులు వెంకటసుబ్బయ్య, ఎల్లా సుబ్బయ్య, జర్నలిస్టు యూనియన్ నాయకులు విలేకరులు పాల్గొన్నారు.

పాణ్యం మండల కమిటీ అధ్యక్షులుగా అధ్యక్షుడిగా శ్రీనివాసులు (ఆంధ్రజ్యోతి), ఉపాధ్యక్షులుగా అప్సర్ బాషా (సూర్య), కార్యదర్శిగా ఇప్ప సుధాకర్(పాయింట్ అవుట్ న్యూస్), సహాయ కార్యదర్శిగా రాజు (సిటీ కేబుల్), ట్రెజరర్‌గా రవి (వార్త) ఎన్నికయ్యారు.

గడివేముల మండల కమిటీ అధ్యక్షులుగా మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులుగా అంజన్ నాయక్, కార్యదర్శిగా లివి కుమార్ ,సహాయ కార్యదర్శిగా శ్రీధర్ యాదవ్, ట్రెజరర్ గా ఎస్ రాముడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.





# జర్నలిస్టులకు రాయితీ కల్పించాలి

గుర్తింపు పొందిన జర్నలిస్టులకు రాయితీలు కల్పించాలని కోరుతూ విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రాలను అందజేశారు. జర్నలిస్టులకు గతంలో రైల్వేల్లో యాభై శాతం రాయితీ ఉందని ఆ రాయితీని తొలిగించారని, తిరిగి పునరుద్ధరించాలని కోరారు. అదేవిధంగా వృత్తి నిర్వహణలో అనేక ప్రాంతాలు తిరిగే జర్నలిస్టులకు టోల్ భారం లేకుండా మినహాయింపు ఇవ్వాలని కలిశెట్టి కోరారు.

**కేంద్రమంత్రి గడ్కరీకి వినతి**

ప్రభుత్వం గుర్తింపు పొందిన జర్నలిస్టులందరికీ టోల్ ఛార్జీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర హైవే, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభ్యర్థించారు. జులై 2వ తేదీ ఢిల్లీలోని ఆయన కార్యాలయం లో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు టోల్ ఫీజు మినహాయింపు అమలు జరిగితే సమాజ శ్రేయస్సు

పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు

కోసం మరింత నిబద్ధతతో పనిచేసేందుకు ఇది ఎంతగానో సహాయ పడుతుందన్నారు.

**రైల్వేమంత్రి వైష్ణవ్‌కు వినతి**

కోవిడ్ మహమ్మారి వ్యాప్తి చెందిన సమయంలో జర్నలిస్టులకు తాత్కాలికంగా రద్దు చేసిన రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని.. సీనియర్ సిటిజన్లకు రైల్ టికెట్ చార్జీలలో రాయితీని పెంచాలని.. అలాగే శారీరిక, మానసిక వికలాంగులకు రాయితీని అందించే సౌకర్యాలను పెంచడం తోపాటు దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన వికలాంగ ధ్రువీకరణ పత్రాలను ఆమోదించాలని కోరుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆంధ్రప్రదేశ్ లోని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభ్యర్థించారు. జులై 3వ తేదీ రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవికి అప్పలనాయుడు వినతిపత్రం అందజేశారు.

## విలేకరిపై తప్పుడు కేసు పెట్టిన సిఐ సస్పెన్షన్

ఇంట్లో తుపాకీ తూటాలు అమర్చి..తప్పుడు కేసు బనాయించిన సిఐని ఉన్నతస్థాయి పోలీసు అధికారి సస్పెండ్ చేశారు. ఈ సంఘటన ఖమ్మం జిల్లాలో జరిగింది. ఖమ్మం పట్టణంలో స్థానిక విలేకరి ఇంటిలో తుపాకీ తూటాలు దొరికినట్లుగా తప్పుడు కేసులు పెట్టడం. అధికారాన్ని దుర్వినియగం చేసి పోలీసు గౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్య వరించిన సీఐ శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# గుడివాడలో సాక్షి విలేకరిపై దాడి



గుడివాడ సాక్షి ఛానల్ రిపోర్టర్ మహేష్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. విలేకరిపై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కృష్ణాజిల్లా కార్యదర్శి వై.శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేశారు.



**ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతిగా ఎన్నికైన చింతకాయల అయ్యన్నపాత్రునికి జ్ఞాపిక బహుకరిస్తున్న ఫెడరేషన్ కార్యదర్శి గంట్లశీనుబాబు**



**విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేన్ ప్రసాద్‌ను అభినందించిన ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పోతుమహంతి నారాయణ్.**

# స్పీకర్, కలెక్టర్‌లకు అభినందనలు


నూతనంగా శాసనసభ సభాపతిగా ఎన్నికై విశాఖపట్నం విచ్చేసిన చింతకాయల అయ్యన్నపాత్రుడును, జిల్లాకు కొత్తగా విచ్చేసిన కలెక్టర్ హరీంద్రప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ విశాఖ జిల్లా నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుని రాష్ట్ర కార్యదర్శి గంట్ల శీనుబాబు కలిసి జ్ఞాపికను బహుకరించి అభినందనలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ హరీంద్రప్రసాద్‌ను జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారికి వివరించి పరిష్కారం కోసం తమ వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల విషయంలో దరఖాస్తులు స్వీకరించారని వారికి వీలైనంత త్వరగా ఇళ్లస్థలాలు కేటాయించేందుకు ప్రయత్నించాలని కోరారు. అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులు ఇంకా అనేక మంది ఉన్నారని వారికి కూడా ఇళ్లస్థలాలు కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. జర్నలిస్టులకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పెన్షన్ పథకం అమలవుతోందని, ఆంధ్రప్రదేశ్‌లో అమలయ్యేందుకు మీ వంతు ప్రయత్నం చేయాలని కోరారు. రాష్ట్రంలో విభిన్న వర్గాల వారికి పెన్షన్ సదుపాయం అందుబాటులో ఉన్నదని, తమిళనాడులో 12వేలకు పైగా పెన్షన్ ఇస్తున్నారన్నారు. జర్నలిస్టులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



Anne Frank, Nazi victim wrote her diary from 12-6-1942 as a birthday present in Amsterdam.

Anne Frank, Diarist of the Holocaust, was born on 12.6.1929 in Frankfurt, Germany. This Dutch Jewish national, aged 13, and her family went into hiding in Amsterdam in 1942 to escape persecution under Nazi occupation. Betrayed two years later they were sent to concentration camps. Anne's diary from June 1942 to August 1944 is regarded as the most famous personal account of the Holocaust, was translated into many languages and turned into a play and film. Anne died, at 15 years, on 21.2.1945, from Typhus (fever) in the German concentration camps.

In French Revolution Tennis Court Oath was sworn by the Third Estate of the Estates General on 20.6.1789.



By June 1789 French Revolution was heating up. Due to unrest and financial crisis, King Louis XVI convened the Estates General. The Bastille fortress was not stormed. Political maneuver was underway. The Third Estate of commoners debated issues of representation. First and second estates were the clergy and nobility. 3 days before their gathering in the Palace of Versailles the Third Estate referred itself as a National Assembly. On 20.6.1789 the members feared an attack by the Royal Govt. In defiance they met at the tennis court in the Palace of Versailles and swore not to disband until a new Constitution of France was formed. This oath was pivotal in the French Revolution.



Ne Win, Burma dictator and President. On 21.6.1988 killed many during demonstration in Rangoon against him.

Ne Win as military officer played crucial role in the early post colonial Burma (Myanmar). Served as Prime Minister. In 1962 led a military coup and toppled the democratically elected govt of U Nu. As President he introduced Burmese Way to Socialism, a political and economic plan to blend socialist principles with Buddhism. Nationalised industries. With a policy of isolationism made Burma one of the world's poorest countries. Ne Win's rule was authoritative, economically mismanaged with civil unrest. He distanced himself from America and Soviet Union. Had good relations with Mao. In 1988 uprising he stepped down. But Burma remained under military control.

Gamal Abdel Nasser Hussein was elected as the President of Egypt on 23.06.1956.



Born in Bakos, Alexandria, Egypt on 15.1.1918, Nasser led 1952 overthrow of the Egypt monarch. He was in the govt of President Mohammed Naguib. Unsuccessful murder attempt was made on Nasser. He arrested Naguib. In 1956 he was elected as President of Egypt. Nationalised Suez Canal. In response Israel, the United Kingdom and France invaded Egypt. But external pressure led them back. Nasser became hero in the Arab world. Israel defeated Egypt in the Six Day War of 1967. Nasser resigned. But was called back on popular support. Continued as Prez till 1970. Nasser remained a symbol of Arabic nationalism, modernization and anti-imperialism. He died on 28.9.1970 at 52 due to heart attack.



Human computer Shankutaladevi like caliculator set world record on 18-6-1980 by mental multiplication

Shakuntala Devi mentally multiplied 2 random 13 digit numbers in 28 seconds. Her correct answer was that 7686369774870x 2465099745779= 18947668177995426462773730. It was unbelievable. Her father was a magician. He discovered Devi's talent when she was 3 years old. He left his career. Both toured showing her capacity. At age 6, Devi displayed her talents at the University of Mysore. In 1944 both moved to London. Toured Europe and America. She achieved a Guinness World Record. Shakuntala was born in Bangalore on 4.11.1929. Died at 83 on 21.4.2013 due to heart, kidney and respiratory problems.

Chilean Marxist President from 1970 Salvador Allende formed a new socialist government on 17-6-1972.



Allende was the first Marxist elected democratically as the head of a country in the Americas. He co-founded Socialist Party of Chile. Served as Health Minister, senator and President of the Senate. In 1970 he was elected as President as candidate of Popular Unity Coalition. Unlike Stalin he didn't cancel old systems and their leaders. In Chilean Way to Socialism, he nationalised industries, education, improved the living standards of the working class. Right wing opposition parties, and America angered with these. On 11.9.1973 Military, supported by CIA, staged a coup and assassinated Allende. Pinochet became dictator.

# ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 ఎంట్రీలకు ఆహ్వానం

ప్రజాశక్తి' వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు -2024 కోసం ప్రజాశక్తి సాహితీ సంస్థ ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. పాత్రికేయ రంగంలో విశేషంగా కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు కోవిడ్ కాలంలో మినహా ప్రతియేటా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్టు సాహితీ సంస్థ కార్యదర్శి ఎంవిఎస్ శర్మ జూన్ 25 నాడిక్కడ ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసరు జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన అవార్డు ఎంపిక కమిటీ సూచన మేరకు ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానిస్తున్నామన్నారు. 2023 మే ఒకటి నుంచి 2024 జూన్ 18 వరకు తెలుగు దినపత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే ఎంట్రీలుగా పంపాలని, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఇందులో పాల్గనవచ్చని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల వార్తా కథనాలను ఎవరైనా సూచించవచ్చని ఆ ప్రకటనలో కోరారు. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపకూడదని తెలిపారు. ఎంట్రీతో పాటు ఇది నా సొంతరచన, ఎవరినీ అనుకరించినది కాదని స్వీయ ధ్రువీకరణ పత్రం జత చేసి పంపాల్సి ఉంటుందన్నారు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేటట్లు పంపాలని, కవర్‌పై ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం అని స్పష్టంగా పేర్కొనాలని ఆ ప్రకటనలో కోరారు. ఇమెయిల్ ద్వారా కూడా పంపవచ్చన్నారు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుందన్నారు. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంట్రీలు పంపాల్సిన చిరునామా: ప్రజాశక్తి సాహితీ సంస్థ, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా, పిన్‌కోడ్-522501, ఇ మెయిల్ అడ్రస్: psmhaward@gmail.com.



## కర్నూలు జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు

నూతనంగా జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధి బృందం జూన్ 29వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, సీనియర్ నాయకులు పానుగంటి చంద్రయ్య, జిల్లా కన్వీనర్ కె.నాగేంద్ర, కో కన్వీనర్ రమేష్, నగర అధ్యక్షుడు శివకుమార్, జిల్లా నాయకులు చంద్రమోహన్, బ్రహ్మయ్య, మధు, దామోదర్, ఎర్రమల తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి జర్నలిస్టుల హౌసింగ్ సమస్యలు, ఇంటిస్థలాల కేటాయింపు తదితర విషయాలు తెలిపారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ జర్నలిస్టుల సమక్షంలో కూర్చుని అన్ని విషయాలు చర్చించి పరిస్కారం చేసేలా చర్యలు తీసుకుందామని హామీ ఇచ్చారు.




# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ

**డిఇఒకు ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి**

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ళలో ఫీజు రాయితీ ఇవ్వాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జూన్ 29న డిఇఓ శ్యాముల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి జిల్లా కన్వీనర్ కె.నాగేంద్ర కో కన్వీనర్ రమేష్, సీనియర్ నాయకులు పానుగంటి చంద్రయ్య, నగర అధ్యక్షుడు శివకుమార్, జిల్లా నాయకులు చంద్రమోహన్‌లు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ళలో ఫీజు రాయితీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) కోరుతున్నదన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా స్కూల్ ఫీజులలో జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు రాయితీని స్కూల్ యాజమాన్యాలు అందిస్తున్నారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్లు, విద్య శాఖ అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. అందుకనుగుణంగా కర్నూలు జిల్లాలో ఉండే స్కూళ్లకు అదేశించి జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇచ్చేలా చూడాలని కోరారు. ఇప్పటికే విద్య సంవత్సరం ప్రారంభం అయింది. అందుకు గాను జర్నలిస్టుల సేవలను సమాజంలో వారి పాత్రను గుర్తించి ఆదేశాలను ఇవ్వగలరని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కోరుతున్నదని తెలిపారు. దీనిపై డిఇఓ స్పందించి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం జర్నలిస్టులకు తగిన న్యాయం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు బ్రహ్మయ్య, మధు, దామోదర్, ఎర్రమల తదితరులు పాల్గొన్నారు.

---



**అరకు పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన గుమ్మ తనుజారాణిని కొయ్యూరు మండల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి దంపతులకు శాలువా కప్పి సత్కరించారు.**



# పద్మవిభూషణ్ రామోజీరావుకు నివాళి

**ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో సంతాప సభ**

పత్రికారంగంలో ఎనలేని కృషి చేసి హిమాలయాల ఎత్తుకు ఎదిగిన కలం యోధుడు మహోన్నత వ్యక్తి పద్మవిభూషణ్ ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు. అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం మాజీ సీనియర్ జర్నలిస్ట్ లలిత కళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య అన్నారు. కర్నూలులో జూన్ 20న లలిత కళా సమితిలో రామోజీరావు సంతాప కార్యక్రమాన్ని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల పాటు సంతాపాన్ని ప్రకటిస్తూ మౌనం వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ పత్తి ఓబులయ్య,తెలుగు పాటకులను మంత్ర ముగ్ధులను చేసిన ఈనాడు దినపత్రిక పత్రికా రంగంలో ప్రత్యేకత చాటి తెలుగు పాఠకుల అభిమానాన్ని సంపాదించుకున్న రామోజీరావు దేశంలోనే ప్రముఖ స్థానాన్ని సంపాదించారని తాను 25 ఏళ్ల పాటు ఈనాడు పత్రికల్లో పని చేశానని సంస్థతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పాఠకులు తాజా వార్తా సమాచారంతోపాటు సేవా కార్యక్రమాల్లో కూడా రామోజీ సంస్థలు కృషి చేశాయని కొనియాడారు. ఈనాడు పత్రిక వల్లే తనకు గుర్తింపు వచ్చిందని ఓబులయ్య స్పష్టం చేశారు. 88 ఏళ్ల వయస్సు గల రామోజీరావు అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. గీతాంజలి గ్రూప్ సంస్థల అధినేత పెరుగు విజయవర్ధన్ రెడ్డి, మాట్లాడుతూ నీతి,నిజాయితీకి సంస్కారానికి నిదర్శనం రామోజీరావు అలాంటి గొప్ప వ్యక్తి ఎక్కడో భూమి అడుగు భాగం నుండి హిమాలయాల ఎత్తుకు ఎదిగిన మహా జ్ఞాని అని కొనియాడారు. తెలుగు జర్నలిజానికి పర్యాయపదం రామోజీ అని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కేంగరా మోహన్ అన్నారు. విలువలు, క్రమశిక్షణ ఆయన విజయ రహస్యమన్నారు. సాహిత్యంలో విపుల, చతుర తెలుగువెలుగు వంటి పత్రికలు స్థాపించి గొప్ప సాహిత్యసేవ చేసాడన్నారు. అనేక కొత్త పదాలను భాషకు పరిచయం చేసాడన్నారు. నిబద్దతకు మారుపేరుగా జీవితాంతం నిలిచారన్నారు. గొప్పవ్యక్తిత్వంతో సేవ చేయడానికి ప్రధాన కారణం వామపక్ష భావజాలంతో వున్న మిత్రులుండటం ఆయనకు అదనపు ఆస్తి అన్నారు. పత్రికాధిపతిగా చరిత్రలో నిలిచిపోయే సంచలనాలను వెలుగులోకి తెచ్చారన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర మాట్లాడుతూ కమ్యూనిస్టు భావాలతో తన గొప్ప ఆశయాలను ఆలోచనలను సమాజ మార్పు కోసం ఆయన చేసిన పోరాటం, తపన చాలా కీర్తించదగ్గ విషయమని అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరం ఆయన ఆశయాలు సిద్ధాంతాలు అదర్శంగా తీసుకోవాలన్నారు.

పాత్రికేయ విలువలకు అద్దం పట్టిన రామోజీ చిరస్మరణీయులని ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ రామకృష్ణ అన్నారు. చిన్నతనం నుంచి పట్టుదలతో కష్టపడి చదివి తిరుగులేని వ్యక్తిగా తనకంటూ ప్రత్యేక సాధించుకున్నారని అన్నారు. క్రమశిక్షణ నిబద్ధతతో పాటు అంకితభావం కలిగిన రామోజీరావును ఆదర్శంగా తీసుకొని జర్నలిస్టు ముందుకు సాగాలని కోరారు. ఈ సంతాప సభలో పలువురు జర్నలిస్టులు కవులు, రచయితలు తమ అనుభవాలు పంచుకుని సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఈటీవీ స్టాఫ్ రిపోర్టర్ శ్యామ్,ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు బసప్ప,వినయ్ కుమార్,రచయిత బసవరాజు,ఈనాడు సీనియర్ జర్నలిస్ట్ ఆంజనేయులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సుజాత, బ్రహ్మయ్య, వెంకటేష్, దామోదర్, ఎర్రమల, మధు, రఫీ ఈటీవీ కెమెరామెన్ శేషు ఫణి, ఫోటోగ్రాఫర్ శైలేష్ తదితరులు పాల్గొన్నారు

# సుదర్శన్‌కు ఫెడరేషన్ నివాళి

### కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



ఇటీవల గుండె పోటుతో మరణించిన సుదర్శన్‌కు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపిడబ్ల్యూజేఎఫ్) కాకినాడ జిల్లా కమిటీ నివాళులు అర్పించారు. జూన్ 22న కాజులూరు మండలం చేదువాడ గ్రామంలో సుదర్శన్ ఇంటివద్ద కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లాతో పాటు కాజులూరు నియోజవర్గ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజయ్యారు. వివిధ పత్రికలు, టివి చానళ్ల కు చెందిన విలేకరులంతా సుదర్శన్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుదర్శన్ కుటుంబ సభ్యులకు ఏపిడబ్ల్యూజేఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్‌లు పదివేల రూపాయలు చెక్‌ను సుదర్శన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యులకు ఎప్పుడు అండగా ఉంటామని, సుదర్శన్‌కు ముగ్గురు కుమార్తెలున్నారని నవీన్ రాజ్ తెలిపారు. మొదటినుంచి ఇదే రంగంలో ఉన్న సుదర్శన్ అందరి మన్ననలు పొందారన్నారు. వృత్తిపట్ల అంకితభావంతో ఎప్పుడు పని చేసే వారిని, సుదర్శన్ మృతి ఏపీడబ్ల్యూజేఎఫ్‌కు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిడబ్ల్యూజేఎఫ్ కాకినాడ జిల్లా నాయకులు పుర్రె త్రినాధ్, పాలిక శ్రీనివాస్, బాబీ, ఖండేపల్లి వెంకట సత్యనారాయణ (సత్య ) మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

---

# కలిమిశ్రీకి సాంస్కృతిక సేవా పురస్కారం

చీరాల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాలులో సహజ సాహితి సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో జూన్ 23న నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో విజయవాడకు చెందిన నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ దంపతులకు అందే మల్లికార్జునరావు – శ్రీమతి ఆదిలక్ష్మి స్మారక సాంస్కృతిక సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు బండ్ల తారకేష్, వడలి రాధాకృష్ణ, చిత్రాడి కిషోర్‌కుమార్, మంత్రి కృష్ణమోహన్, చీరాల పురప్రముఖులు అందె మురళీ వరప్రసాద్, కట్టారాజ్ వినయ్ కుమార్, సింహాద్రి యలమందారెడ్డి, బూనం ఉమా మహేశ్వరరావు, లేళ్ళ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# రిపోర్టర్ రమేష్‌కు ఆర్థిక సహాయం

అమలాపురం శ్రీనిధి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిగ్ టీవీ రిపోర్టర్ మట్టపర్తి రమేష్‌ను ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధివర్గం కలిసి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసింది. ఫెడరేషన్ నాయకులు ముక్కామల చక్రధర్, మట్టపర్తి శీను, కదలి రాజు, ఆకుల సురేష్, కదలి సూరిబాబు, సమయ మంతుల హరి, మహమ్మద్ బషీర్, చింతపల్లి జాన్ రత్నం, మట్టపర్తి త్రిమూర్తులు తదితరులు రమేష్‌ను పరామర్శించారు.





# రిపోర్టర్ పై దాడి, తీవ్ర గాయాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో ఒక ప్రముఖ పత్రికకు రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్ పైన మంగపేట మండలం రామచంద్ర పేటలో కొడవలితో కొందరు దాడి చేశారు. ఎందుకు దాడి చేశారు అనే విషయం తెలియవలసి ఉంది. తీవ్ర గాయాలు అయినా విజయ్‌ను మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడనుండి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# జర్నలిస్టుల పిల్లలకు రాయితీ కల్పించాలి

### సానుకూలంగా స్పందించిన కాకినాడ కలెక్టర్ నివాస్

కాకినాడ జిల్లాలో ఉన్న జర్నలిస్టులకు అనేక ఇబ్బందులు ఉన్నాయని, జర్నలిస్టులలో చాలామంది పేద కుటుంబాల వారేనని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ లు కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్‌కు తెలియజేశారు. జర్నలిస్టుల పిల్లలకు గతంలో ప్రైవేట్ స్కూళ్, కాలేజీల్లో 50శాతం ఫీజు రాయితీ ఉండేదని, మరలా 50శాతం ఫీజు రాయితీ కల్పిస్తే జర్నలిస్టుల పిల్లలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్‌కు తెలియజేశారు. మానవత దృక్పథంతో ఫీజు రాయితీ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జె.నివాస్ విద్యాశాఖ అధికారులతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వీధి గోపీనాథ్, దాసరి శ్రీనివాస్, సత్య, పుర్రె త్రినాధ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సభాపతికి సత్కారం

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు నూతనంగా ఎన్నికై విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) కార్యదర్శి గంట్లశీనుబాబు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు జర్నలిస్టులు, ఇతర పురప్రముఖులు పలువురు తమ అభినందనలు తెలిపారు. సభాపతిగా ఎన్నికైన ఆయన హయాంలో సభాకార్యక్రమాలు హుందాగా సాగి రాష్ట్ర పురోభివృద్ధి జరుగుతుందనే అశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు అయ్యన్నపాత్రుడును ఘనంగా సత్కరించి సింహాద్రినాథుడి జ్ఞాపికను, అలాగే స్వామి మహిమల్ని తెలియజేసే పుస్తకాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన అనేక మంది ప్రముఖులతో అయ్యన్నపాత్రుడు పలు అంశాలపై ముచ్చటించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పేలా శ్రీనివాసరావు, తెదేపా నాయకులు చోడే వెంకట పట్టాభిరాం, రెడ్డి నారాయణరావు తదితరులు అయ్యన్నను కలుసుకున్న వారిలో ఉన్నారు.

**కొత్త క్రిమినల్ చట్టాలపై లెటర్ పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జూన్ 14న నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎ.పి.డబ్ల్యు.జె.ఎఫ్)లు పంపించాయి. పంపిన లేఖ తెలుగు ప్రతిని ఇక్కడ పొందుపరుస్తున్నాం.**

తేదీ: జూన్ 13, 2024

ప్రియమైన **శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు,**

గౌరవాధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ

**విషయం: మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పౌరుల నుండి విజ్ఞప్తి చేయడం జరిగింది.**

గౌరవనీయులైన సర్,

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మీకు హృదయపూర్వక అభినందనలు.

జాతీయ రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ (టిడిపి) ప్రధాన పాత్ర పోషించాలని నిర్ణయించుకున్నందుకు దిగువ సంతకం చేసిన మేము కూడా సంతోషిస్తున్నాం.

ప్రస్తుత పరిస్థితుల్లో, భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక సూత్రాలను దృఢంగా నిలబెట్టేందుకు టీడీపీ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటుందనీ, రాజ్యాంగంలో హామీ ఇచ్చిన ప్రజాస్వామిక హక్కులను కాపాడేందుకు తన శక్తి మేరకు అన్ని విధాలా ప్రయత్నిస్తుందని మేము ఆశిస్తున్నాం.

దురదృష్టవశాత్తూ, ఇప్పుడు దేశం కొత్తగా తీసుకురాబోతున్న మూడు క్రిమినల్ చట్టాల వల్ల తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటోంది.. 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 2023', 'భారతీయ న్యాయ సంహిత 2023' 'భారతీయ సాక్ష్య అభినియ, 2023' అనే మూడు కొత్త క్రిమినల్ చట్టాల రూపంలో ఈ ముప్పు రానున్నది. 2023 డిసెంబర్ 20న ఎలాంటి చర్చ లేకుండానే పార్లమెంటులో హడావిడిగా ప్రవేశపెట్టారు.

ఈ చట్టాలు 2024 జులై 1 నుండి అమలులోకి రావడానికి సిద్ధం చేయబడ్డాయి. కనుక మీరు వెంటనే దీనిపై స్పందించాలి.

మా ప్రధాన ఆందోళన ఏమిటంటే, ఇప్పుడున్న ఈ చట్టాలకు చేసిన సవరణలు అత్యంత క్రూరమైన స్వభావం కలిగినవి. వ్యక్తి జీవించే హక్కు, స్వేచ్ఛకు పలురకాలుగా హానికలిగించే విధంగా ఉన్నాయి. పౌరుల హక్కులకు (ప్రతికూల ప్రభావం) ప్రత్యేకించి భావప్రకటనా స్వేచ్ఛకు, సమావేశమయ్యే హక్కునకు, సంఘటితమయ్యే హక్కునకు, ప్రజాస్వామిక హక్కునకు, ఇతర పౌరహక్కులకు భంగం కలిగిస్తూ అవి నేరపూరితమైనవనే అభిప్రాయం కలిగించే రీతిలో ఈ మూడు చట్టాల్లోని అంశాలు ఉన్నాయి.

మరీముఖ్యంగా, ఈ కొత్త క్రిమినల్ చట్టాలు మన ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడానికి భారతదేశాన్ని ఫాసిస్ట్ రాజ్యంగా మార్చడానికి ప్రభుత్వానికి తగిన శక్తిని సమకూరుస్తాయి.

చట్టాన్ని గౌరవించే ప్రజాస్వామ్య ప్రత్యర్థులు, అసమ్మతివాదులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకునేందుకు, నిర్బంధించేందుకు, విచారించి జైలుశిక్షల పాలుజేసేందుకు ఈ ప్రతిపాదిత కొత్త చట్టాలు ప్రభుత్వాలకు అవకాశం కల్పిస్తున్నాయి.

ఈ కొత్త క్రిమినల్ కోడ్‌లో ప్రత్యేక దృష్టి సారించాల్సిన కొన్ని అంశాలివి:

**(1) న్యాయబద్ధమైన, చట్టబద్ధమైన, అహింసా పూర్వక ప్రజాస్వామిక ప్రసంగం లేదా చర్యను నేరపూరిత 'ఉగ్రవాదం' గా పరిగణించింది.**

**(2) దేశద్రోహ నేరాన్ని కొత్త అవతారంలో మరింత విస్తృతపరిచి చూపారు. (దీనిని "విద్రోహ-ప్లస్" అని పిలవవచ్చు)**

**(3) సైద్ధాంతిక రాజకీయ ప్రత్యర్థులు లక్ష్యంగా, రాజకీయం పక్షపాతంతో "సెలెక్టివ్ ప్రాసిక్యూషన్" పేరిట విస్తరించారు.**

**(4) ఉపవాసం ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే ఒక సాధారణ రాజకీయ నిరసనను నేరంగా పరిగణించడం**

**(5) వ్యక్తుల సమావేశాలకు వ్యతిరేకంగా బలప్రయోగ వినియోగాన్ని ప్రోత్సహించడం**

**(6) పోలీసు అధికారి ఆదేశాన్ని ప్రతిఘటించడం, తిరస్కరించడం, విస్మరించడం లేదా పట్టించుకోకపోవడాన్ని నేరపూరితం అనడం ద్వారా పోలీసు రాజ్యాన్ని మరింతగా విస్తృతపరచడం.**

**(7) బేడీలు వేయడాన్ని తప్పనిసరిచేయడం.**

(8) విచారణ సమయంలో పోలీసు కస్టడీని గరిష్ఠంగా పెంచడం.

(9) ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్.ఐ.ఆర్) తయారీ పోలీసుల విచక్షణకు అప్పగించడం.

(10) జైలు శిక్ష బాధను తెలిసేట్లు చేయడం.

(11) ప్రభుత్వానికి వ్యక్తుల (ఏ నేరం ఆరోపణలు లేని వారు కూడా) బయోమెట్రిక్‌లను తప్పనిసరిగా ఇవ్వాలని బలవంతం చేయడం

(12) కొన్ని సంఘ్ పరివార్ కార్యకలాపాలకు రక్షణ కల్పించడం.

ఈ దేశ ప్రజాస్వామ్య నిర్మాణానికి రాబోయే ముప్పు కారణంగా, ఈ సందేహాస్పద చట్టాల చిక్కులను న్యాయ నిపుణుల బృందం తిరిగి పరిశీలించి, భారత పార్లమెంటు వేదికపై చర్చించే వరకు వాటి అమలును నిలిపివేసేందుకు మీ తక్షణ జోక్యాన్ని కోరడానికి మమ్మల్ని ఒత్తిడి చేసింది.

పేర్కొన్న క్రిమినల్ చట్టాలు అమల్లోకి రావడానికి ఇంకా పదిహేడు రోజులు మిగిలి ఉన్నందున, కొత్త క్రిమినల్ చట్టాల చిక్కుల గురించి మీకు తెలియజేసే చట్టపరమైన అంచనాల బృందాన్ని మీరు కలుసుకోవాలని మేము హృదయపూర్వకంగా కోరుతున్నాం. పౌర హక్కులకు భంగం కలగకుండా నిరోధించడానికి మీ సారథ్యంలో మీ పార్టీ తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

మీరు మా వినతికి సానుకూలంగా స్పందిస్తారని, పైన పేర్కొన్న క్రిమినల్ చట్టాల అమలును నిలిపివేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారని మేము ఆశిస్తున్నాం.

మీకు కృతజ్ఞతలు,

మీ భవదీయుడు,




# జర్నలిస్టులకు శిక్షణ శిబిరం

ఎపిడబ్ల్యుజెఎఫ్ అమలాపురం నియోజవర్గ కమిటీ సమావేశం అధ్యక్షుడు కడలి రాజు అధ్యక్షతన ఆదివారం అమలాపురం ప్రెస్ క్లబ్ లో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ప్రత్యేక ఆహ్వానితులు, సీనియర్ జర్నలిస్టు ముక్కామల చక్రధర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న జర్నలిస్టు కుటుంబాలను ఆదుకునే లక్ష్యంతో ఫెడరేషన్ పనిచేయాలని సూచించారు, త్వరలోనే ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు మట్టపర్తి శ్రీను, సమయమంతుల హరి, రెడ్డి బాబు, మహమ్మద్ బషీర్ హాజరై ఫెడరేషన్ అభివృద్ధికి తగు సూచనలు చేశారు. అనంతరం సభ్యులు ప్రవేశపెట్టిన పలు అంశాలను చర్చించి తీర్మానించారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు ఆకుల సురేష్, ప్రధాన కార్యదర్శి కడలి సూరిబాబు, కమిటీ సభ్యులు చింతపల్లి జాన్ రత్నం, ఊటాల చిరంజీవి, మట్టపర్తి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టు శివాజీ మృతి

హైదరాబాద్‌లో సీనియర్ జర్నలిస్టుగా పనిచేసిన కుర్రా శివాజీ జూన్ 23వ తేదీ మరణించారు. శివాజీ దాదాపు మూడు దశాబ్దాలుగా జర్నలిజం రంగంలో పనిచేశారు. ఆయన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సభ్యులుగా ఉన్నారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) తెలంగాణ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ సంతాపం తెలియజేశారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధానక్యార్యదర్శులతో పాటు మేనేజింగ్ కమిటీ ప్రగాఢ సంతాపం తెలియజేసింది.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎంపీ, ఎమ్మెల్యే లను కలిసిన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు



జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తామని కాకినాడ ఎంపీ తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీలు




హామీ ఇచ్చారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎంపీ, ఎమ్మెల్యేలను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా నాయకత్వం జూన్ 16వ తేదీ కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ జర్నలిస్టుల సమస్యలను వారికి వివరించారు. నిబంధనలను సడలించి అక్రిడిటేషన్ కార్డులను జర్నలిస్టులందరికీ జారీ చేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ త్వరితగతిన ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యేలు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫెడరేషన్ ప్రతినిధులను అధిష్టానం వద్దకు తీసుకొని వెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ అధినేత మొదటి నుంచి జర్నలిస్టుల పట్ల సానుకూల భావనతో ఉన్నారని ఎంపి తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్‌ను ఇంత పటిష్టం చేసిన నవీన్ రాజ్‌ను ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన్నరాజప్ప, పంతం నానాజీలు అభినందించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్‌కు నవీన్ రాజు మొదటి నుండి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అందుకే యూనియన్ అటు రాష్ట్రంలో ఇటు జిల్లాలలో ఇంత పటిష్టంగా ఉందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసిన వారిలో రాష్ట్ర సభ్యులు ఎండి అధికార్, ఎస్.కె మున్ని, జిల్లా నాయకులు పుర్రె త్రినాధ్, బొండాడ భాస్కర్, బిందాన సురేష్, ధర్మరాజు, రామ్ ప్రసాద్, కొమ్ము సురేంద్ర, రెడ్డి, నక్క శ్రీను, రాము, పండు తదితరులు ఉన్నారు.



# సీనియర్ జర్నలిస్టు మురళీధర్‌రెడ్డి మృతి

సీనియర్ జర్నలిస్టు, ది హిందూ దినపత్రికలో సుదీర్ఘకాలం పని చేసిన బి. మురళీధర్ రెడ్డి జూన్ 22వ తేదీ రాత్రి కన్నుమూశారు. ది హిందూ దినపత్రికలో మూడు దశాబ్దాల కాలం పనిచేసిన మురళీధర్ రెడ్డి పాకిస్తాన్ శ్రీలంకలో కరస్పాండెంట్ గా సేవలందించారు. 1980 దశకంలో న్యూఢిల్లీలో ద హిందూ కొత్తగా ఎడిషన్ ప్రారంభించిన సమయంలో మురళీధర్ రెడ్డి సిటీ రిపోర్టర్‌గా విధుల్లో చేరారు. అనంతరం రాజకీయ కార్యకలాపాల జర్నలిస్టుగా ఆయన సుదీర్ఘకాలం పనిచేస్తూ అనేక అంశాలపై వార్తలు రాశారు. ఆయన 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత సంఘటన రిపోర్ట్ చేశారు. 2000 సంవత్సరంలో ఆయనను పాకిస్తాన్ ఇస్లామాబాద్ కరస్పాండెంట్‌గా నియమించారు. అనంతరం కొలంబోలో విలేకరిగా పనిచేశారు. 64 ఏళ్ల వయసున్న మురళీధర్ రెడ్డి మెయిన్ స్ట్రీమ్, నేషనల్ హెరాల్డ్ దినపత్రికల్లో కూడా పనిచేశారు. ఆయన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ నుంచి పట్టా పొందారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్



జర్నలిస్టు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.కె.పాండే, ఎన్.కొండయ్యలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# ఆర్మూరు విలేకరి అశోక్ మృతి


నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో సుదీర్ఘకాలం ఈనాడు రిపోర్టర్‌గా పనిచేసిన జి అశోక్ గుండెపోటుతో జూన్ 17 అర్ధరాత్రి మరణించారు. ఛాతిలో నొప్పి రావడంతో స్థానిక డాక్టర్ వద్దకు చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని నిజామాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. వెంటనే నిజామాబాద్ తీసుకెళ్లి వైద్యం చికిత్స చేస్తుండగానే ఆయన ఆస్పత్రిలో



మరణించారు. నిజామాబాద్ నుండి వెలువడే పొద్దు దినపత్రికలో 1989లో చేరి జర్నలిజం వృత్తిలో ఆయన అడుగు పెట్టారు. 1990లో ఈనాడు ఆర్మూరు డివిజన్ రిపోర్టర్‌గా తన వృత్తి జీవితాన్ని కొనసాగించారు. జర్నలిస్టుగా అవినీతి అక్రమాలపై ఎన్నో వార్తా కథనాలు రాశారు. అశోక్ ఎప్పుడూ స్నేహభావంతో ఉండేవాడు. వివాదాలకు దూరంగా వ్యవహరించేవారు. ఈనాడు విలేకరిగా ఉన్నా చాలామంది ఆయన వద్దకు వచ్చి మంచి చెడుల గురించి చర్చించేవారు. జర్నలిస్టుగా సాధ్యమైనంతవరకు మంచి సలహాలను ఇచ్చేవారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ సంతాపం ప్రకటించారు.

# సీనియర్ జర్నలిస్ట్ సైదులు గౌడ్ మృతి

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో సీనియర్ జర్నలిస్టుగా పనిచేసిన సైదులు గౌడ్ ఆకస్మికంగా మరణించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, దౌర్జన్యంపై నిరంతర పోరాటం చేసిన సైదులుగౌడ్ మరణించడం పట్ల ఆ ప్రాంతంలోని రాజకీయ నాయకులు కూడా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ ప్రగాఢ సంతాపం తానుభూతి వ్యక్తం చేశారు. సైదులు మరణం పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్.ఎ.జె) తెలంగాణ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ సంతాపం తెలియజేశారు.





# జర్నలిస్టు ఉద్యమ నేత గారపాటి ఉపేంద్ర బాబు కన్నుమూత

సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి డిప్యూటీ ఎడిటర్, జర్నలిస్టు ఉద్యమనేత గారపాటి ఉపేంద్ర బాబు (89) జూలై 5వ తేదీ విజయవాడ సమీపంలోని ఆయన స్వగ్రామం కానరనేనివారిపాలెంలో కన్నుమూశారు. 1961లో ఆంధ్రజ్యోతిలో సబ్ ఎడిటర్‌గా జర్నలిస్టు ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. పదవీవిరమణ వరకు ఉపేంద్రబాబు అదే సంస్థలో వివిధ బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ ఎడిటర్ హోదాలో పదవీ విరమణ చేశారు. జర్నలిస్టు ఉద్యమం బలంగా ఎదుగుతున్న దశలో ఆయన ఉద్యమ సారథిగా వ్యవహరించారు. యూనియన్ బాధ్యతల్లో ఉంటూ విధినిర్వహణ చేస్తూ బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శించి మన్ననలు అందుకున్నారు. జర్నలిస్టు ఉద్యమ నాయకునిగా యువ జర్నలిస్టులను ప్రోత్సహించడంలో, నాయకత్వ లక్షణాలను గమనించి యువకులను జర్నలిస్టు ఉద్యమంలోకి తీసుకురావడంలో ప్రముఖ పాత్ర వహించారు. వేజ్‌బోర్డులు వచ్చిన సమయంలో జర్నలిస్టులను సంఘటిత పరిచి ఒకతాటిపై నడిపించారు. విజయవాడలో కృష్ణానది ఒడ్డున అంత్యక్రియలు జరిగాయి.

### ఎన్ఏజె, ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఏ సంతాపం

సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి డిప్యూటీ ఎడిటర్ గా పనిచేసిన గారపాటి ఉపేంద్ర బాబు మృతి పట్ల నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్, ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశాయి. 1935లో జన్మించిన ఉపేంద్ర బాబు సుదీర్ఘ కాలం ఆంధ్రజ్యోతిలో వివిధ హోదాలలో పనిచేశారు. డిప్యూటీ ఎడిటర్ హోదాలో పదవీ విరమణ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టు ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. ఆయన యూనియన్ కార్యకలాపాలలో చురుకైన నాయకుడిగా ఉన్నారు. యూనియన్ అధ్యక్షుడిగా రెండు దఫాలు పనిచేశారు. స్నేహశీలి, జర్నలిస్టుల శ్రేయోభిలాషిగా వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఆయన లేని లోటు తీర్చలేనిది. యువ జర్నలిస్టులను అనుక్షణం ప్రోత్సహించడంలో ముందు ఉండేవారు. ఆయన మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ఎన్ఏజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏలు ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశాయి.

ఆయన భౌతిక కాయాన్ని జులై 5వ తేదీ ఉదయం 11 గంటలకు విజయవాడ స్వర్గపురి క్రిమిటోరియం వద్ద ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, పద్మ, సాంబశివరావు తదితరులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.



విజయవాడలో
జరిగిన ఈనాడు
అధినేత రామోజీరావు
సంస్మరణ సభలో
ప్రసంగిస్తున్న
ముఖ్యమంత్రి నారా
చంద్రబాబునాయుడు





సమాచార,
గృహనిర్మాణ శాఖ
మంత్రి
కె.పార్థసారధితో
ఫెడరేషన్ ప్రతినిధులు

జర్నలిస్టులకు రైళ్లలో
ప్రయాణరాయితీ, టోల్
రుసుం మినహాయింపు
కోరుతూ కేంద్ర మంత్రులు
వైష్ణవ్, గడ్కరీలకు
వినతిపత్రాలు అందజేస్తున్న
పార్లమెంటు సభ్యులు
కలిశెట్టి వెంకటరావు







ఆంధ్రప్రదేశ్ డిజిపిగా
నియమితులైన
ద్వారకాతిరుమలరావుకు
అభినందనలు తెలిపిన
ఫెడరేషన్ ప్రతినిధులు